# తెలుగు జ్యోతి

## తెలుగు కళా సమితి వారి

సంచిక : జులై 2023



**Telugu Jyothi**
JULY 2023

A Literary Magazine from
**Telugu Fine Arts Society**

తెలుగు కళా సమితి

# Telugu Fine Arts Society

A 501 (c) Non Profit Org, Tax ID : 22-2534166, www.tfasnj.org

Telugu Fine Arts Society
తెలుగు కళా సమితి

40th Anniversary

ESTD : 1983

# Ruby Year Celebrations

SAVE THE DATE

## Sunday, 8th October 2023

Time : 9:00 am onwards

Venue :
Royal Albert's Palace
1050 King Georges Post Rd,
Fords, NJ 08863

Convenor :
Damu Gedala
(856) 577-7112

DIGITALAYA • +91 9246 578 478

TFAS Board of Trustees 2022-24

Madhu Rachakulla: (201) 312 1305
Srinivas Cheruvu: (732) 447 6686
Jyothi Kamarasu: (609) 578 8606
Bindu Yalamanchili: (908) 240 3167
Venkata Satya Tata: (973) 985 3409
Anil Veerisetty: (571) 218 8562
Ravi Annadanam: (917) 355 5503
Sudha Devulapalli: (732) 331 9313
Naga Mahendar Velishala: (732) 429 6025

# తెలుగు కళా సమితి
# Telugu Fine Arts Society, Inc.
A tax exempt and not for profit corporation: Tax Id# 22-2534166
9 Yardley Ct, Franklin Park, NJ 08823: **http://www.tfas.net**



**Board of Trustees 2022-2024**

**President**
**Madhu Rachakulla**
*president@tfas.net*

**Vice President**
**Bindu Yalamanchili**
*vicepresident@tfas.net*

**Membership Services**
**Jyothi Kamarasu**
*membership@tfas.net*

**Secretary**
**Ravi Annadanam**
*secretary@tfas.net*

**Treasurer**
**Srinivas Cheruvu**
*treasurer@tfas.net*

**Cultural Events**
**Sudha Devulapalli**
*events@tfas.net*

**Community Services**
**Venkata Satya Tata**
*Community@tfas.net*

**IT Services**
**Naga Mahendar Velishala**
*it@tfas.net*

**Youth Services**
**Anil Kumar Veerisetty**
*youth@tfas.net*

**Advisors**
Dr. Hari Eppanapally
Radha Kasinadhuni
Dr. Satyaveni Rao
Dr. Raja Rao
Seshu Tatikatla

**Telugu Jyothi**
**Vignan Kumar Utukuri**
Editor


## అధ్యక్షుని కలం నుండి



తెలుగు కళా సమితి సభ్యులకు , శ్రే యోభిలాషులందరి కి నమస్సుమాంజలులు.

పద్య, పద్యనాటకం కేవలం తెలుగు భాషకు మాత్రమే సొంతం. తెలుగు కళా సమితిలో మొట్టమొదటి సారిగా అమెరికా లో పుట్టి పెరిగిన పిల్లలతో పద్యనాటకం ప్రదర్శింపచేయటం నిజంగా ఒక సాహసమే. ఆ సాహసాన్ని కళారత్న శ్రీ గుమ్మడి గోపాలకృష్ణ మరియు కళావేదిక సంస్థ సహకారంతో 2023 జులై 16 వ తేదీన శ్రీకృష్ణరాయబారం నాటకం ప్రదర్శన విజయవంతంగా నిర్వహించాము. ఇక్కడి మహిళలు, బాల బాలికలతోనే ఎక్కువ కార్యక్రమాలు నిర్వహించాలని మా సంకల్పం. ఇక మనం తెలుగు కళా సమితి 40వ వార్షికోత్సవం నిర్వహించటానికి సన్నద్ధులం అవుతున్నాము.

మీ అందరి సహాయ సహకారాలతో మరిన్ని చక్కటి కార్యక్రమాలు చేయాలనీ మా సంకల్పం. మీ సద్విమర్శలని, సలహాలని పంపించాలని నా మనవి .

మీ
**రాచకుళ్ళ మధు.**
అధ్యక్షులు, తెలుగు కళా సమితి
201-312-1305

# సంపాదకీయం

ఈ యేడు తెలుగు కళా సమితికీ తెలుగుజ్యోతికీ నలభై ఏళ్ళు నిండుతాయి. ఆ సందర్భంగా అక్టోబర్ నెలలో భారీ ఎత్తున వార్షికోత్సవాలు జరపడానికి సన్నాహాలు జరుగుతున్నాయి. తెలుగు జ్యోతి దీపావళి సంచిక నలభై ఏళ్ళ వార్షికోత్సవ సంచిక గా వెలువడుతుంది. రాజకీయాలు రాకుండా కేవలం మన కళలకీ సాహిత్యానికీ సేవ చేస్తూ గడపగల్గాం ఈ నలభై ఏళ్ళూనూ. తెలుగు కళా సమితితో మీ అనుభవాలు editor@telugujyothi.com కి పంపండి.

తెలుగు తనం మీద వచ్చిన మిగతా రచనలు ఈ సంచికలో ప్రచురిస్తున్నాం.

సరోజ గారు, మనోహర గారూ, ప్రభాకర మూర్తి గారూ, సుజనా దేవి గారూ, అందరూ కూడా తెలుగు తనమంటే పెసరట్టు, గోంగూరా, చీర కట్టు, వగైరా వగైరా మీరు చెప్పినవన్నీనూ అని మా మాట మాకే తిప్పి కొట్టారు.

కానీ వీరంతా కూడా అమలాపురం వేద పండితులకి ప్రసిద్ధి అన్న పాత కాలం గురించే వ్రాశారనిపిస్తున్నది. ప్రస్తుత కాలం తెలుగు వారి నానుడి, 'అమలాపురం నుంచి అమీర్ పేట కి (software schools కి) అమీర్ పేట నుంచి అమెరికాకి' (Amalapuram to Amir peta to America) అని మారి పోయిందీ అన్న పరివర్తన ఎవరూ గుర్తించలేదా అనిపించింది.

ఇక ఈ సంచికలోని మిగతా రచనలు:

సైనికులకి జోహారులర్పించారు మాధవి గారు.

విజయలక్ష్మి గారు 'crime doesn't pay' అన్న తమ నమ్మకం వెలిబుచ్చారు.

నిజంగా ఒక చందమామ కథ వ్రాశారు ప్రకాశ రావు గారు.

భూమి తల్లి మట్టి తల్లి అని గానం చేశారు అంజయ్య గారు.

తల్లి కడుపు అంటే ఏమిటో కథగా వ్రాశారు రోహిణి గారు.

అంజయ్య గారు నిరంతర బాల్యపు వాన తుంపురులే జీవితమన్నారు.

నాగజ్యోతి శేఖర్ గారు దివ్యాంగుల జీవితాల గురించి బాగా వ్రాశారు.

వాణీ శ్రీనివాస్ గారు అతివేగంగా పరిగెడుతున్న కాలంలో పూజారి కుటుంబాల బాధలు వ్రాశారు.

రవికుమార్ గారు, రాఘవేంద్ర రావు గారు స్త్రీ గురించి surreal poems వ్రాశారా అనిపించింది.

తెలుగు రాష్ట్రాలలో ఈ వేసవిన మండిన ఎండలని తన చిత్రంలో బాగా చూపెట్టారు ఉమాకాంత్.


## సంపాదక వర్గం

ఊటుకూరి విజ్ఞాన్ కుమార్ (Editor), ఉప్పల అనంత సుధాకర్, తాడేపల్లి కుమార్, బొగ్గవరపు లవకుశ, తిప్పాభొట్ల రవిశంకర్, తోడుపునూరి శ్రీనివాస్

## BOT Representatives

తాతా వేంకట సత్య

# విషయ సూచిక


| | | |
|---|---|---|
| అధ్యక్షుని కలం నుండి | | 3 |
| సంపాదకీయం | | 4 |
| పెసరట్టు- ఉప్మా | కొమరవోలు సరోజ | 6 |
| మనం తెలుగువారమండీ | విశ్వనాథ రెడ్డి | 7 |
| వందనం! అభివందనం!! | బైటారు మాధవి | 8 |
| తోలు బొమ్మలాట | తెలికిచెర్ల విజయలక్ష్మి | 9 |
| చందమామ కథ | ఓట్ర ప్రకాష్ రావ్ | 11 |
| మట్టి పరిమళం | కొమురవెల్లి అంజయ్య | 17 |
| గునుగు పూలు నవ్వాయి | వంజారి రోహిణి | 18 |
| ఆత్మీయత సిరులు | కొమురవెల్లి అంజయ్య | 23 |
| భరత వాక్యం | బి. గౌతమ్ కుమార్ | 23 |
| కొత్త నడక | డి. నాగజ్యోతి శేఖర్ | 24 |
| తెలుగుతనం | తాతా వేంకట సత్య ప్రభాకర మూర్తి | 27 |
| ఎల్లలు దాటిన తెలుగుతనం | బోగా మనోహర్ | 28 |
| అభయహస్తం | గొర్తి వాణి శ్రీనివాస్ | 30 |
| తెలుగుతనమంటే | నామని సుజనాదేవి | 36 |
| చీఫ్ | దేశరాజు రవి కుమార్ | 37 |
| తస్మాత్ జాగ్రత్త! | నల్లబాటి రాఘవేంద్ర రావ్ | 37 |


Opinions expressed in this volume are those of the authors and not of TFAS.

# పెసరట్టు- ఉప్మా

కొమరవోలు సరోజ

లక్ష్మిపతి గారింట్లో ఉప్మా-పెసరట్టు పార్టీ కి కొందరు స్నేహితుల్ని ఆహ్వానించారు. శనివారం 5 గంటలకే రమ్మని లక్ష్మి పతిగారి సతీమణి సుహాసిని అందరికి చెప్పింది . కొందరు గ్రోసరీ కెళ్ళి 6 గంటలకొచ్చారు. మరి కొందరు సాయంత్రం బ్యూటీ స్లీప్ అయ్యాక కొత్తగా ఇండియానుండి తెచ్చుకున్న సరికొత్తనగలు వేసుకుని, అంతకంటే సరికొత్త చీరెలుకట్టుకుని ముచ్చటగా ముస్తాబై 7 గంటలకొచ్చారు.

రాగానే అందరికీ వేడివేడి పచ్చిమిరపకాయ బజ్జీలు, సన్నగా తరిగిన ఉల్లిపాయ ముక్కలు, కొంచం నిమ్మరసం, పైన కొంచం కొత్తి మీరవేసినవి 2 బజ్జిలు ఒకప్లేటులో, మరొక చిన్నప్లేటు లోఒక అరిశ అందరికీ ఇచ్చింది సుహాసిని.

లక్ష్మిపతిగారు అందరికి ఘాటు ఘాటు ఆర్గానిక్ అల్లం బాగా దంచి వేసిన టీ పెద్దపెద్ద కప్పులనిండా పోసి సర్వ్ చేసారు. "ఇవన్నీ తిని ఇంత టీ తాగితే పెసరట్టు ఎట్లా తింటాం?" అడిగారొకరు. "చూద్దాంలే...10 గంటలకు" చెప్పారు లక్ష్మిపతి.

లక్ష్మిపతి, సుహాసిని ఇద్దరూ గుంటూరు సీమవారే. బిఎస్సి. లోను ఎం. స్సీ లోకూడా క్లాసుమేట్స్. పెళ్లి తరువాత కెనడా వచ్చి సెటిలయ్యారు. తెలుగు భాషన్నా, సంస్కృతి, సంప్రదాయాలన్నా వెర్రి అభిమానం. ఈరోజు పార్టీకి కూడా అదే కారణం. అందరూ ఫ్యామిలీ రూములో ఇంచక్కా రౌండ్ టేబుల్ కాన్ఫరెన్స్ మాదిరిగా కార్పెట్ మీద గుండ్రంగా సమావేశమయ్యారు.

లక్ష్మిపతి చెప్పటం మొదలుపెట్టారు. న్యూజెర్సీ తెలుగు కళాసమితి ఆధ్వర్యంలో దాదాపు 35 వసంతాలు పూర్తిచేసుకున్న "తెలుగు జ్యోతి" పత్రిక మనందరికీ తెలిసిందే కదా! ఎలాంటి సాంకేతిక సాధనలులేని కాలం నుండి నిరాటంకంగా జరుగుతోందని మనందరికీ తెలుసు. మనం ఎట్లా వ్రాసినా, ఏమి అనకుండా శ్రమపడి, ప్రచురించి మనల్ని ప్రోత్సహించారు. వారు ఇప్పుడు ఒక ప్రణాళిక చేపట్టారు. మనపట్ల గౌరవంతో మనల్ని కూడా పాలు పంచుకోమని అనటం వల్ల ఈరోజు మిమ్మల్నిరమ్మన్నాను. ఎందుకన్నా-నంటే కొన్ని విషయాలలో కేవలం నా ఒక్కడి భావజాలం ప్రదర్శించటంకంటే వివిధకోణాలను దర్శించి వెలువరించే పలువురి అభిప్రాయాలు విలువయినవని. "సరే ముందు ఆడవాళ్ళతో మొదలుపెడదాం."

"తెలుగుతనమంటే ఏమిటి?"

"పెసరట్టు రుచి, గోంగూర పసా, ఆవకాయ అరిసెలు, సున్నుండల రుచి తెలిసి ఉండటమా?"

మాయ మాట్లాడింది. "అవును, లేకపోతే వాళ్ళు తెలుగు వాళ్ళేకాదంటాను".

"మగవాళ్ళు ధోవతి, ఉత్తరీయం, ఆడవాళ్లు చీర ధరించ-టం, సంక్రాంతికి గొబ్బెమ్మలు పెట్టడం జ్ఞాపకాలను పంచుకో-డం, సామాన్య వ్యవహార నిర్వహణకు సరిపడినంత తెలుగు-భాష ను మరచిపోకుండావుండటం. బొమ్మలకొలువు సంక్రాంతికి తప్పకుండ పెట్టడం. గొబ్బెమ్మలు గోధుమపిండితో చేసి పైన దట్టంగా కాఫీపొడి అద్ది పైన ప్లాస్టిక్ గుమ్మడిపూలు గుచ్చటం" చెప్పింది రత్నసీత.

"నానా రుచిరార్థసూక్తి నిధి, ప్రసన్న కథా కలితార్థ యుక్తి, యెల్లనృపులు గొలువ ఎరుగవే బాసాడి, భాగవతంబు తెలిసి పలుకుట, వేయి పడగల పాము విప్పరుకొనివచ్చే, ఇదీ తెలుగుతనమంటే" నొక్కి వక్కాణించాడు రాధాకృష్ణ.

"వేలంటైన్స్ డే మనది కాకపోవచ్చు కానీ ప్రతిమనిషికీ అవసరమైంది ప్రేమే కనుక అందువల్ల మన తెలుగుతనం మంటగలుస్తుందని నేననుకోను" ఉమాదేవి ఉవాచ.

"రాఖీ పండుగ ఆంధ్రాలో మనకు అలవాటు లేకపోవచ్చు. కానీ భారతీయులదేకదా! ఆకోణంలో ఆలోచిస్తే అక్కా-తమ్ముళ్ళ మధ్య, అన్నాచెలెళ్ల మధ్య మరింత అనురాగం కలుగుతుందని నమ్మకమేకాదు, వాస్తవంకూడా. అలాంటప్పుడు ఆచరిస్తే అది తప్పని నేను అనుకోను. అందువల్ల మన తెలుగు తనం కొన్ని పాళ్ళు తరిగి పోతుందనీ నేననుకోను" తన అభిప్రాయం ఖచ్చితంగా చెప్పాడు. ఫణీంద్ర.

"అట్లతద్దెకి గోరింటాకు పెట్టుకోడం, తెల్లవారు ఝామున పెరుగన్నం తినటం, కొత్త బట్టలు కట్టుకుని ఉయ్యాల ఊగటం. సాధ్యమైతే ఇక్కడకూడా జరుపుకోవటం, హాట్ డాగ్స్ లాంటివి తినకపోవడం, భావి తరాలవారికి మన పండుగలు, పబ్బాలు, నోములు, వ్రతాలూ ఇత్యాదులు తెలియచెప్పటం ..... " మాధవి చెప్పింది.

"నేను చెబుతాను" అంటూ లేచి నిలబడ్డాడు అనురాగ్.

"అందరూ, కూర్చునే మాట్లాడారుగా! నువ్వెందుకు లేచావు?" అడిగింది సుహాసిని.

"ఏమి లేదాంటీ, నిలబడి మాట్లాడితే నాకేదో ఉత్సాహం వచ్చినట్లుంటుంది." అన్నాడు. అందరూ చిరునవ్వులు చిందించారు.

“తెలుగుతనమంటే ప్రధానంగా తెలుగులో మాట్లాడాలి. మన తరువాత తరం వారికి కూడా తప్పనిసరిగా తెలుగు నేర్పించాలి. తెలుగు పద్ధతులు, సంస్కృతి సంప్రదాయాలు గౌరవించడం, పాటించడం, తెలుగు సంస్కృతి గురించి వివరంగా తెలుసుకోవటం. ఇద్దరు తెలుగువాళ్లు కలిసినపుడు మనసారా హాయిగా తెలుగులో మాట్లాడుకోవడం, అవసరమైనప్పుడే ఇంగ్లీషులో మాట్లాడటం. పెద్దలను వినయంతో గౌరవించడం“

“లక్ష్మీపతి గారూ, మీరు మాట్లాడండి, ఆకలి మొదలవు-తోంది. రేపు ఉదయం గుడిలో తెలుగు క్లాసులున్నాయికదా! మీ అభిప్రాయం విని పెసరట్లు తిని, బయల్దేరుతాం“ చెప్పారు మిత్రులు.

“మీరందరు చక్కగా చెప్పారు, ధన్యవాదాలు, సమయం తీసుకుని వచ్చినందుకు, మీఅభిప్రాయాలు మాతో పంచుకున్నందుకు. అయితే నా దృష్టిలో భాష అత్యంత ప్రధానమైనది. ఆభాషను పరిరక్షించుకునే బాధ్యత మనమీదే వుంది. సంఘంలో పరస్పర అవగాహనా సాధనం భాషే. మాతృభాషలో చదువుకున్న వారికి ఇతర భాషలు, సులభతరం అవుతాయి. అదట్లావుంచి, శ్రీశ్రీకవిత్వం, దేవులపల్లి వారి గేయాలు, జాషువా కవిత్వం. విదూషీమణి ఊటుకూరి లక్ష్మీ కాన్తమ్మగారి కవిత్వం చదవాలన్నా మనకు భాష ముఖ్యం. అట్లాగే, అన్నమయ్య, త్యాగరాజుల వంటి వాగ్గేయ కారుల పద సంపద అవగాహన కావాలన్నా, కూచిపూడి నాట్యంలో హావ, భావ, రసాలు ఆస్వాదించాలన్నా, భాష తెలియాలి. తెలుగు సంస్కృతి, సంప్రదాయాలన్నీ మన భాషతోనే ముడిపడివున్నాయి. సంస్కృతి, పద్ధతులు నిలుస్తాయి అనటంలో సందేహం లేదు. భాషను ఏమాత్రం అశ్రద్ధ చేసినా అది కను మరుగయ్యే అవకాశం ఎక్కువ కనబడుతోంది కనుక అందుకు తగిన కృషిచేసి, మన తెలుగు భాషను అమృతతుల్యంగా ఆస్వాదించగలిగితే ...అదే తెలుగు తనమని నావిశ్వాసం“ అంటూ ముగించారు లక్ష్మీపతిగారు.

సుహాసిని, అందరికీ పెసరట్లు స్టెయిన్లెస్ స్టీల్, కంపార్ట్మెంట్ పళ్లేలలో ఒక్కొక్కళ్ళకి 2 పెసరట్లు కొంచం ఉప్మా, అల్లం-పచ్చడి, కొబ్బరిపచ్చడి, కొత్తావకాయవేసి, పెసరట్లమీద కొద్దిగానెయ్యి వేసి యిచ్చింది.

“తెలుగు భాష మాధుర్యం బాగా వివరించారు, మీరు చెప్పినది చాల సముచితంగా వుంది.”

“అవును. తెలుగుతనమంటే ముమ్మాటికీ తేనె వంటి మన తెలుగే” అన్నారందరూ. సుహాసిని స్త్రీలకు బొట్టుపెట్టి “విశిష్ట తెలుగు మహిళలు” అనే పుస్తకాలిచ్చింది. లక్ష్మీపతిగారు పురుషులందరికీ శ్రీ కాళహస్తీశ్వర శతకాలిచ్చారు. పార్కింగ్ వరకూ వెళ్లి మరొకసారి అందరికీ థాంక్స్ చెప్పి ఇంట్లోకి అడుగు పెట్టిన ఆ తెలుగు దంపతులకు మనసంతా తెలుగు వెలుగు తో నిండి పోయింది. “ఇదే నిజమైన తెలుగుతనం“ అని తృప్తిగా శ్వాస తీసుకున్నారు.

ఈ రచనపై మీ స్పందన editor@telugujyothi.com కి పంపగలరు.

## మనం తెలుగువారమండీ

విశ్వనాథ రెడ్డి

మనం
తెలుగువారమండి..!

మనమే...
తెలుగువారమండి..!!

అజంత భాషగ
ప్రసిద్ధికెక్కిన
అనంత రీతుల
కీర్తిని పొందిన
అమ్మ లాంటి ప్రేమ ఉన్న
అందమైన భాష మనది..!

కపుల కలం గళం పలుకు
కమ్మనైన భాష మనది..!!
కలకాలం మనమంతా
కలిసి మెలిసి ఉండాలని.!

కలలుగన్న ఆ ఊహే
ఒక కమ్మని తలంపు..!!

కుల మతాల కుత్సితాల కుడ్యాలను ఛేదించి
కూడినపుడు సమస్యలకు
ఒక చక్కని ముగింపు..!!

అనురాగం, ఆప్యాయత హృదయంలో
నిండాలి..! ఉత్సాహం, ఉత్తేజం..
ఊపిరి గా ఉండాలి..!!

సహకారం సమభావం
సయోధ్యతో కలవాలి..!
అన్యోన్యత ఆప్యాయత అయోధ్యగా
నిలవాలి..!!

అది మనసును కదిలించే
దీవెన...!

అదే మనిషిని గెలిపించే
భావన..!!

మనం..
మనమందరం...
మన లోపలి దీపాలని
వెలిగిద్దాం..!

అశేష వైషమ్యాలను అసూయా చీకట్లను..
తొలగిద్దాం..!!

మనం..
తెలుగువారమండి..!

మనమే
తెలుగువారమండి..!!□

మీ స్పందన editor@telugujyothi.com కి పంపగలరు.

# వందనం! అభివందనం!!

బైటూరు మాధవి

ఉగ్గుపాలతో దేశభక్తిని రంగరించి అమ్మ చెప్పిన దేశ భక్తుల కథలు విని
చిన్ననాటి నుండే మాతృ భూమి పైప్రేమ ని అణువణువునా నింపుకుని సైన్యం లో చేరడానికి ఉర్రూతలూగి
అన్ని కఠిన పరీక్ష లలో నిలిచి చిరుతలా సైన్యం లో చేరుతావు
భరతమాత ముద్దు బిడ్డనని మురిసిపోతావు
క్రమశిక్షణకు, ధైర్యానికి, తెగువకు, త్యాగానికి మారుపేరు నువ్వు
ఏమని పొగడము నీ గొప్పదనాన్ని
ఓ సైనికుడా! పరాక్రమవంతుడా !
వందనం! అభివందనం!

నిప్పులు కక్కే ఎండైనా ,ఎముకలు కొరికే చలైనా
గడ్డ కట్టించే మంచైనా ఆపదు నిను ఏ శక్తి
పగలనక, రేయనక సరిహద్దుల్లో అనుక్షణం అప్రమత్తమై
ఏ నిమిషం ఎటునుంచి వచ్చే ముప్పు తో పోరాడేందుకు సదా సన్నిద్ధం గా ఉంటావు
కోట్లాది మోములలో చిరునవ్వులకోసం బాధలన్నీ భరిస్తావు
ఏమి ఇచ్చి నీ ఋణం తీర్చుకోగలము
ఓ సైనికుడా! సాహస వీరుడా!
వందనం! అభివందనం!

తల్లి తండ్రులను, పెరిగిన ఊరిని,అన్నిటిని వదిలి దేశమాత సేవకై తరలిపోతావు
భార్యాపిల్లలను కూడా వదిలి సుదూరాలలో సేవలు చేస్తుంటావు
అల్లర్లు ,ముచ్చట్లు చూడకుండానే ఎదిగిన పిల్లలని చూసి ఆశ్చర్యపోతావు
మా కుటుంబాలను రక్షించడానికి నీ కుటుంబానికే దూరమౌతావు
దేశవాసులకోసం నీ సుఖాలను త్యాగం చేస్తున్న
ఓ సైనికుడా! త్యాగ మూర్తి!
వందనం! అభివందనం!

సరిహద్దు లోనే కాదు దేశం లోపల పిలవగానే పలుకుతావు
ప్రకృతి వైపరీత్యాలలో మేమున్నాం అంటూ ఆపన్న హస్తం అందిస్తావు
ఆటుపోట్లను మాకోసం భరిస్తూ
మేమంతా క్షేమం గా ఉండటమే నీ భాద్యత అని తలుస్తావు
కొదమ సింహం లాంటి
ఓ సైనికుడా! నిజమైన నాయకుడా!
వందనం! అభివందనం!

ప్రతిరాత్రి మేము గుండెలపై చెయ్యి వేసుకుని పడుకున్నామంటే నువ్వక్కడ ఉన్నావని భరోసాయే
శత్రుదేశానికి చిక్కినా దేశరహస్యాలను గుట్టుగా ఉంచుతావు
నీ విధ్యుక్త ధర్మాన్ని మరువవు నిమిషమైనా
యుద్ధం లో ప్రాణాలు కోల్పోవాల్సి వస్తుందని తెలిసి కూడా నీ పిల్లలను కూడా పంపడానికి వేయవు వెనుకడుగు
శత్రువుల పాలిట సింహ స్వప్నమా !
వందనం! అభివందనం!

---

మీ స్పందన editor@telugujyothi.com కి పంపగలరు.

# తోలు బొమ్మలాట

తెలికిచెర్ల విజయలక్ష్మి

'ఎవరైనా, పొద్దున్న లేవగానే మంచిపని చేయాలనుకుంటారు. నా ఖర్మకి లేవగానే చెత్తలు ఏరుకునే దానిలా ఈ నత్తలు ఏరుకోవటం ఏవిటో?' అని తిట్టుకుంటూ..వాకిట్లో ఉన్న నత్తల్ని ఏరి, దోసెడు గడ్డలుప్పు వేసిన కవర్ లో వేస్తూ సీతాలక్ష్మి గొణుగుతుంటే..

"మొదలైందా ఆంటీ! నత్తలు ఏరే కార్యక్రమం? మీరలా వాటిని ఉప్పు వేసి చంపుతుంటే...అవి, ఉప్పులో కరుగుతున్న వాసనకి నాకు వాంతి వస్తుంది. నేను, మాత్రం వారానికి ఒకసారి మందు స్ప్రే చేస్తాను వాకిలంతా" అంటూ మొహం తిప్పుకుంది గౌరి.

"ఆ మందులు ప్రమాదం తల్లీ. చిన్న పిల్లలున్నారు ఇంట్లో ఎక్కడ పెడతావో జాగ్రత్త. ఎక్కడనించీ తయ్యారవుతాయో ఈ నత్తలు. ఈ రోజు వాకిలంతా తిరిగి ఏరెస్తానా! రేపటికల్లా, ఇంతకు రెండింతలు తయ్యారుగా వుంటాయి. 'నత్తలొస్తున్నాయి జాగ్రత్త' అనే నవల చదివినప్పుడు అన్నీ... కల్పితాలు అనుకున్నాను. ఇవి, చూసేక నిజంగా ఆ రచయిత రాసినవన్నీ నిజాలే అనిపిస్తుంది. సరే, నేపోయి కాఫీ తాగుతా" అంటూ లోపలకు వెళ్ళబోతున్న సీతాలక్ష్మిని, గౌరి ఆపి..

"ఆంటీ, బాబాయ్ గారు ఊళ్ళోనే ఉన్నారా?"

"ఉన్నారమ్మా. ఏమైనా పనివుందా?"

"రాత్రంతా, చంటిది ఏడుస్తూనే ఉంది. కలకత్తా, డ్యూటీకి వెళ్ళిన ఈ మనిషి ఒక్క ఫోన్ చెయ్యలేదు. మొన్నను రావాల్సింది ఇంతవరకూ రాలేదు" అంది దిగులుగా.

"మీ బాబాయిని, ఆఫీసులో కనుక్కొమ్మంటాలే" అంటూ అరబస్తా దాకా ఐన నత్తల్ని మూటలాకట్టి గేట్ బయటకు విసిరి స్నానానికి వెళ్ళింది సీతాలక్ష్మి.

పూజ, చేస్తున్న సీతాలక్ష్మి మనసు నిలకడగా లేదు. గౌరి పురిటికెళ్ళినప్పుడు, ఆమె భర్త సూర్య స్నేహితులను ప్రతీరోజూ ఇంటికి తెచ్చి పేకాడటం, అర్ధరాత్రి దాకా నవ్వులతో హోరెత్తిస్తుంటే...ఆ గోలకి రాత్రంతా నిద్ర ఉండేది కాదు. ఆ బాధ భరించలేక ఒకరోజు రామంగారు, సూర్యని పిలిచి నెమ్మదిగా నచ్చచెప్పటంతో అప్పటినుంచీ స్నేహితులను తీసుకు రావడం మానేసేడు. అప్పటినుంచీ సూర్య, ఇంటికి వస్తున్నాడో, లేదో కూడా తెలిసేది కాదు.

పుట్టింటినించీ వచ్చిన గౌరి, ఇద్దరు పిల్లలతో అవస్థపడుతుంటే..గౌరిమీద ఉన్న అభిమానంతో, పడుకున్న భర్తను లేపి...

"పక్కింటి సూర్య, మూడ్రోజులై ఇంటికి రాలేదని గౌరి బెంగపడుతోంది. ఒక్కసారి వాళ్ళ ఆఫీసుకి వెళ్ళి కనుక్కోండి" అన్చెప్పి పనిలో పడింది సీతాలక్ష్మి.

***

మధ్యాహ్నం భోజనానికి వచ్చిన రామం..

"ఈ వెధవ, ఇంటికి రాకుండా... వేరే దానితో కులుకుతున్నాడు. ఈ భాగోతం ఆఫీసులో అందరికీ తెలుసునట. వీడికి, చీవాట్లు పెట్టి నాతోపాటు తీసుకు వచ్చేను" అంటూ సూర్య గురించి భర్త చెప్పిన మాటలు విని 'ఇది తప్పుడు సమాచారమయితే బాగుండును' అనుకుంటూ నిద్రకుపక్రమించింది సీతాలక్ష్మి. నిద్ర రావటం లేదు. ఈ సంగతి విన్న నాకే ఇంత బాధగా ఉంది, ఆ అమ్మాయి ఎలా తట్టుకుంటుందో? మనసు అశాంతిగా అనిపించి ఒక్కసారి గారితో మాట్లాడాలి అనుకుంటూ...గౌరికి ఫోన్ చేస్తే, ఆమె ఎత్తటంలేదు. మంచం మీద మరి ఉండాలనిపించక గౌరీ వాళ్ళ ఇంటి గేట్ తలుపు తీసుకుని వెళ్ళి తలుపు తట్టింది. ఎంత తలుపు కొట్టినా తియ్యటంలేదు. ఏదో అనుమానంగా అనిపించి... భర్తకు ఫోన్ చేసి...

"ఏవండీ, గౌరి తలుపు బిగించుకొని లోపల కూర్చుంది. ఎంత కొట్టినా తియ్యటంలేదు. నాకేదో అనుమానంగా ఉంది. సూర్యని త్వరగా రమ్మనండి" అంది.

సూర్య వచ్చి, తలుపులు విరగ్గొట్టేడు. అందరూ లోపలకు వెళ్ళగానే కనబడిన దృశ్యం...నోట్లోనుంచి నురగలు కారి గుడ్లు ముందుకు పొడుచుకొచ్చి భయంకరంగా చచ్చి పడివున్న పిల్లలు, నోట్లోనుంచి నురగ కారుతూ కాళ్ళూ చేతులూ కొట్టుకుంటూ మరణ వేదన పడుతున్న గౌరి...పక్కనే పడి ఉన్న పురుగుల మందు డబ్బాను చూసి... అందరికీ పరిస్థితి అర్థమైంది. గౌరిని, హాస్పటల్ కి తీసుకు వెళ్లేలోపు కక్కించాలి. విషం కక్కేస్తే బతకడానికి ఆశ వుంటుందని...పరుగున వాకిట్లోకి పరుగెత్తి... నత్తగుల్లలు ఏరి చిన్నగిన్నెలో ఉప్పుతో కరిగించి... ఆ రసం తెచ్చి, బలవంతంగా గౌరికి తాగించింది సీతాలక్ష్మి. భళ్ళున వాంతి చేసుకున్న గౌరిని, పిల్లలను హాస్పటల్ కి తరలించేరు. పిల్లలు, చనిపోయారని డాక్టర్స్ డిక్లేర్ చేసేరు. అపస్మారకస్థితిలో వున్న గౌరిని బతికించటానికి ప్రయత్నం చేస్తున్నారు డాక్టర్స్." ఎందుకీ ప్రయత్నం చేసింది? పసి పిల్లల్ని దారుణంగా చంపవలసిన అవసరమేమొచ్చిందని?"

పోలీస్ లు సూర్యని ప్రశ్నిస్తున్నారు. ఎవ్వరికీ, సమాధానం చెప్పకుండా మౌనంగా ఉన్నాడు సూర్య.

వారంరోజులు గడిచేయి. గౌరికి, తెలివొస్తే స్టేట్మెంట్ తీసుకోవటానికి పోలీసులు సిద్ధంగా ఉన్నారు. అప్పుడే డ్యూటీకి వచ్చిన నర్స్, మూలుగుతున్న గౌరిని చూసి..

"ఎందుకిలాంటి పని చేసేవు? మీ ఆయన, నీకోసం ఎంత ఏడుస్తున్నాడో?" అంటూ తెలివి వచ్చిన గౌరిని మందలించింది.

భర్త, కన్నీళ్ళు పెట్టుకుంటున్నాడనే మాటతో మనసు కరిగి," అతన్ని చూడాలనుందంటూ" విలపించింది గౌరి.

"ఉండు, బయటెవరూ లేకపోతే పంపిస్తాను" అని, సూర్యని లోపలకు పంపింది నర్స్.

మూలుగుతున్న, భార్యను చూస్తుంటే భయం వేస్తోంది సూర్యకు. మెల్లిగా... భార్య చేతిమీద చెయ్యివేసి...

"ఎందుకిలాంటి పని చేసేవు? మనం మధురంగా గడపిన రోజులేలా మర్చిపోయావు?" అని భర్త రోదిస్తుంటే..

"ఇంటికి, ఆలస్యంగా వస్తూ...ఏమని అడిగితే, కసురుతూ...నేను గట్టిగా అడిగేసరికి వండిన వంటంతా విసిరి, మహేష్ చెల్లెలిని పెళ్ళి చేసుకుంటా. నువ్వంటే, నాకు అసహ్యంమని అనగానే...మా ఉనికి మీకు నచ్చదని అర్థమై, మీరే దూరమైతే, నాకీలోకంతో పనిలేదనుకున్నాను. పిల్లలు, అనాథలవటం ఇష్టంలేక వాళ్ళను ముందు చంపేను. పొదరిల్లులాంటి నా సంసారం పేక మేడలా కూలిపోవడం తట్టుకోలేకపోయాను" అంటూ ఏడుస్తున్న భార్య మాటలకు...

"ఒకరోజు, డ్యూటీ ఎక్కువగా చెయ్యవలసి వచ్చి, అలసటగా ఉండటంతో.. ఇంటికి రాగానే నువ్వు సాధిస్తుంటే...కోపంతో, పప్పుచారు చెయ్యలేదని వేరేదాన్ని చేసుకుంటాను అన్నాను. దానికోసం ఇంత అఘాయిత్యం చెయ్యాలా? పోనీలే, కనీసం నువ్వైనా బతికితే...నీ ఆరోగ్యం కుదుట పడ్డాక, డాక్టర్ సలహాతో పిల్లల కోసం ఆలోచిద్దాం" అంటున్న భర్త మాటలకు గౌరి మనసు కరిగి బతుకు మీదాశపుట్టి, పిడికెడంత ప్రేమకు పరవశించింది. చిటికెడు పసుపు కుంకుమతో మళ్ళీ కడుపు పండుతుందనే ఆశతో... చావుతో పోరాడుతూ ఆ ప్రాణం తపన పడింది.

"డాక్టర్ గారొస్తున్నారు. బయటకు వెళ్ళండి" అనే నర్స్ మాటతో బయటకు దారితీసాడు సూర్య. తెలివొచ్చిన గౌరిని పలకరించిన డాక్టర్, పోలీసులను పిలిచి స్టేట్మెంట్ తీసుకోమ్మన్నాడు.

"నాదే తప్పు. భర్తను అర్థం చేసుకోలేకపోయాను. మూడు రోజుల తరువాత, డ్యూటీ నించీ వచ్చిన భర్త, ఇష్టమైన పప్పుచారు చెయ్యమన్నాడని కోపంతో పిల్లల్ని చంపి నేను చావటానికి ప్రయత్నించేను. నన్ను క్షమించండి" అంటూ స్టేట్మెంట్ ఇచ్చింది గౌరి.

"ఆత్మహత్యా ప్రయత్నం నేరమని నీకు తెలియదా? నువ్వు ఎంత కర్కోటకురాలివి? కడుపున పుట్టిన పసి ప్రాణాలను ఎలా చంపగలిగేవు? నిన్ను, పోలీసులు కస్టడీలోకి తీసుకుంటారు" అనే నర్స్ మాటతో కుళ్ళికుళ్ళి ఏడ్చింది గౌరి. పిల్లల్ని, చంపేనన్న బాధతో ఏడ్చిఏడ్చి... ఆరాత్రే ఆమె ఆరోగ్యం వికటించి మృత్యువు ఒడిలోకి చేరుకుంది.

భార్యకి, సరైన సమయంలో సింపతీ చూపించి, జైల్ జీవితం నించీ తప్పించుకున్నందుకు సంతోషించి గండం గట్టెక్కిందనుకుని..కార్యక్రమాలు పూర్తిచేసి, బారుకెళ్ళి తృప్తిగా తీర్థం పుచ్చుకుని ఇంటికి బయలుదేరాడు సూర్య.

***

గౌరి, మరణ వార్త విన్న సీతాలక్ష్మి..

"ఏమండీ, మనం ఇక్కడ ఉండద్దు. మన సొంత ఇంటికి వెళ్ళిపోదాము" అంటూ ఏడుస్తున్న భార్యను ఓదారుస్తూ..

"అలాగే, వెళ్ళిపోదాం. బాబాయ్, అంటూ గౌరి పిలిచే పిలుపు, ఇంకా నా చెవిలో ఉన్నట్టే ఉంది. మనకి, ఈ ఇంటితో అనుబంధం చాలా ఎక్కువ. ఇక్కడే రిటైర్ అయి, సొంత ఇంటికి వెళ్ళాలనుకున్నాము. ఇప్పుడు, ఈ దుర్మార్గుడి పొరుగున ఉండాలని నాకూ లేదు. చచ్చేంటి సాధించిందాపిల్ల? చావు పరిష్కారమని ఎందుకు అనుకుంది? ఆడపిల్లని పెళ్ళిచేసి పంపడమే కాదు, మానసిక దృఢత్వం పిల్లలకు ఇయ్యాలి. అప్పుడే ఆత్మహత్యలు ఆగుతాయి. సర్లే, ఇంక ఆ విషయం వదిలెయ్యి. ముందు, మన అమ్మాయి దగ్గరకు వెళదాము. తరువాత, ఇల్లు ఖాళీ చేసేద్దాం. సరేనా ఇంక పడుక్కో" అని భార్యకు సర్ది చెప్పి నిద్రకుపక్రమించేరు రామం.

పొద్దున్నే, గేట్ శబ్దం అవుతుంటే..'ఇంత పొద్దున్నే ఎవరో అనుకుంటూ..' తలుపు తీసిన రామం, సూర్య స్నేహితుడిని చూస్తూ..ఏంటి అన్నట్టుగా సైగ చేసేరు.

"సూర్య, వస్తున్న బైక్ కి ఇసక లారీతో ఏక్సిడెంట్ అయి కాళ్ళు తెగిపడ్డాయిట. పెళ్ళాం, పిల్లలు పోయేరు. ఆ దుఃఖం తీరకుండానే ఈ ఆపద వచ్చింది. మనం వెళ్ళి ధైర్యం చెప్తే బాగుంటుందేమో?" అంటున్న అతని మాటకు...

"నేను రాను. ఎవర్ని ఎలా ఓదార్చాలో ఆ భగవంతుడికి బాగా తెలుసు. ఇది, ఆ పరమాత్ముడు ఆడించే తోలుబొమ్మలాటలో భాగమే" అంటూ తలుపు వేసేసాడు రామం.

(సమాప్తము)

## చందమామ కథ

ఓట్ర ప్రకాష్ రావ్

సూర్యా హోటల్ నుండి బయటకు వచ్చి సైకిల్ దగ్గరకు వెళుతూ రోడ్డు వైపు చూసాడు కార్తీక్. 'ఆ బామ్మ ఇంకా అలాగే నిలబడివుందే' అనుకొంటూసైకిల్ అలాగే ఉంచి ఆమె దగ్గరకెళ్ళి ఉలిక్కిపడ్డాడు. ఆమెకు ఒక కాలు లేకపోవడం వల్ల కర్రల సహాయంతో నిలబడి వుంది.

"బామ్మాగారూ రోడ్డు దాటించాలా" అంటూ అడిగాడు.

"చాలా సేపట్నుండి నిలబడి ఉన్నాను. .ఎవరూ పట్టించుకోలేదు. అందరికీ ఉరుకుల పరుగుల జీవితమయిపోయింది" వణుకుతున్న గొంతుతో అంది.

ఆమె ప్రక్కనే నిలబడి" నాతోపాటు మెల్లగా రండి" అంటూ సగం రోడ్డు దాటించాడు కార్తీక్.

"నేను ఇంతకు మునుపు హోటల్ నందు టిఫన్ కు వెళ్తున్నప్పుడు చూసాను. టిఫన్ పూర్తి చేసుకొని బయటకు రాగానే అలాగే వుండటం చూసి అనుమానం తో ఇక్కడకు వచ్చాక తెల్సింది. మీ కాలు ఒకటి. ..సారీ బామ్మా"

"నేను చదువుకొనేటప్పుడు జరిగిన ప్రమాదంలో కాలు పోయిన సంగతి నేను ఆలోచించడం మరచిపోయాను" అంది.

"ఇక్కడ ట్రాఫిక్ సిగ్నల్స్ వుండవు. కొంత దూరంవెళ్తే ట్రాఫిక్ సిగ్నల్తోపాటు ట్రాఫిక్ పోలీసు వుంటారు. మీరు ఎవరి సహాయం లేకుండా ధైర్యంగా దాటవచ్చు. ఎక్కడకు వెళ్తున్నారు"

"మనసుబాగోలేక. ఆ గుడికి వెళ్లివస్తున్నాను. ఇప్పుడు ఇంటికెళ్తున్నాను"

"ట్రాఫిక్ ఖాళీ అయింది రండి" అంటూ రెండోసగం రోడ్డు దాటించి" బామ్మా మీ దగ్గర ఫోన్ ఉన్నదా" అనడిగాడు

ఉందన్నట్టు తలాడించగానే "బామ్మా, ఇప్పటికే నాకు ఆఫీసుకు ఆలస్యం అయింది. నా సెల్ నెంబరు వ్రాసిస్తాను. మీకు తీరికున్నప్పుడు ఫోన్ చెయ్యండి. నా పేరు కార్తీక్. ఆఫీసులో క్లర్క్ గా పనిచేస్తున్నాను. మీమనసులో బాధ చెప్పండి. నాకు చేతనయిన సహాయం చేస్తాను" అంటూ చెప్పి ఒక పేపర్ నందు తన నంబర్ వ్రాసిచ్చి వేగంగా వెళ్ళాడు కార్తీక్.

******

మూడు రోజుల తరువాత రింగ్ అవుతున్న సెల్ ఫోన్ తీసుకొని "హలో" అన్నాడు కార్తీక్

"హలో కార్తీక్ బాగున్నావా. నేనెవరో గురుతుపట్టావా" వణుకుతున్న గొంతుతో వచ్చిన మాటలు వినగానే

"ఓహ్. .బామ్మాగారూ బాగున్నారా" అన్నాడు కార్తీక్

"ఇప్పుడు నా సమస్య సులభంగా పరిష్కారం అయింది. నాకథ ఒక మహా భారతం. నీకు చెప్పాలనిపించి ఫోన్ చేసాను అసలు సమస్య నాది కాదు, నా మనవరాలు శ్రావణిది"

"మీ మనవరాలు ఏం చేస్తోంది"

"కాలేజీలో డిగ్రీ చేస్తోంది"

"డిగ్రీ చివరి సంవత్సరం చదువుతోంది. హాస్టల్ భోజనం సరిపోదని బయట గది అద్దెకు తీసుకొని శ్రావణికి తోడుగా నేనుండసాగాను. చివరి సంవత్సరం ఇబ్బంది లేకుండా పూర్తిచేయవచ్చనుకొన్నాను ,కానీ ఇలా జరుగుతుందని ఊహించలేదు. ..."

"ఏం జరిగింది బామ్మా"

"శ్రావణికి నేను అమ్మమ్మను, నా కూతురు కాన్సర్ తో మరణించగానే మా అల్లుడు విరక్తితో జీవించసాగాడు. మా వూరిలో రాజనాల వున్నాడు. వాడు శ్రావణికి బావ వరుస అవుతాడు. డిగ్రీ ఎందుకు చదివిస్తారు నాకిచ్చి పెళ్లి చెయ్యండి అని గొడవచెయ్యడం ప్రారంభించాడు."

"సొంతం అంటున్నారుగా. పెళ్లి చేయవచ్చుగా"

"సొంతం కావచ్చు కానీ వాడొక దగుల్బాజీ... తిరుగుబోతు. వాడు శ్రావణిని ప్రేమించడంలేదు శ్రావణి వెనుకనున్న యాభై ఎకరాల పొలాన్ని, ఆస్తిని ప్రేమిస్తున్నాడు. పెళ్లి చేసుకొందామురా అంటూ శ్రావణితో గొడవ చెయ్యడం ప్రారంభించాడు"

"బామ్మా, మీరీ సమస్యను ఎలా పరిష్కరించారో తెలియదు కానీ, మీది చాలా చిన్న సమస్య. అనవసరంగా బాధపడ్డారు. పోలీసులకు ఫిర్యాదు చెయ్యండి, ఆ తరువాత వాడు మీ జోలికి రాడు"

"కార్తీక్ నేను రిటైర్డ్ టీచర్ని, నాకూఆ ఆలోచన కలిగినా మా అల్లుడు అంగీకరించలేదు. ఏం చెయ్యాలో అర్థంకాక ఆ రోజు గుడికెళ్ళి తిరిగివస్తూ నిన్ను కలిసాను"

"సమస్య పరిష్కారమైందని చెప్పారు"

"లేడీస్ హాస్టల్ నందు చేర్పిస్తే ఒక్క మగ పురుగు లోనికి ప్రవేశించడని తెలుసు. బాగా అలోచించి నేను శ్రావణిని హాస్టల్ నందు చేర్పించి మా గ్రామానికి వచ్చాను. నా మానసిప్పుడు ప్రశాంతంగా ఉంది."

"బామ్మా , ఒక ముఖ్యమైన విషయం. మీరు చదువుకొని ఉద్యోగం చేసిన వారు. ఇంకా రెండుకర్రలతో నడుస్తున్నారు. కృత్రిమ కాలు అమర్చుకొని నడవవచ్చుగా"

"పెళ్లెయ్యాక మా వారు పట్నానికి తీసుకెళ్లారు. ఆ ఆసుపత్రిలో పనిచేసేవారందరూ మొగవారే కావటం వల్ల, స్త్రీలు వారి దగ్గరకు కొలతలిచ్చి సహాయక పరికరాలను అమర్చుకోవటానికి సంశయించేవారు. ఆ కారణంతో నేను వద్దనుకుని వచ్చేసాను"

"మీలాగే సిగ్గుపడి చాలామంది వికలాంగ స్త్రీలు చేతి కర్రలతో నడవడానికి సిద్ధపడుతున్న సంగతి తెలుసుకొని ఇప్పుడుమహిళా ఉద్యోగులను నియమించారు. "

"నేనూ వినపడ్డాను ,వయసు మళ్లింది ఇక ఎక్కువగా నడిచే పనిలేదు అందుకే కృత్రిమ కాలు వేసుకోవాలన్న ఆలోచన మానుకున్నాను"

******

లగ్గేజి ఆటో నిలబడగానే డ్రైవర్ ప్రక్కసీటులో కూర్చొన్న శ్రావణి దిగింది. శ్రావణి ఆ ఇంటివైపు చూసింది. ఇంటి గోడలు ఏ క్షణాన్నయినా కూలిపోవడానికి సిద్ధంగా వున్నట్లుంది, పై కప్పుగా పాలిథిన్ కవర్ కప్పబడింది. ఆ పాలిథిన్ పేపర్ పైకి ఎగిరిపోకుండా పాత టైర్లు, చెక్క ముక్కలు ఇనుప రేకులు వేసిఉండటం గమనించింది.

ఒక అబ్బాయి శ్రావణి దగ్గరకు వచ్చి మర్యాదపూర్వకంగా చేతులు జోడించి "మీకు ఎవరు కావాలి" అడిగాడు

"కార్తీక్ గారున్నారా"

"కార్తీక్ అన్నయ్య మార్కెట్టుకు వెళ్లారు. మా నాన్నగారిని పిలుచుకొనివస్తాను" అంటూ లోనికి వెళ్లి మంచంపై పడుకొన్న శేషాద్రికి చెప్పగానే, ఆయన మెల్లగా నడచుకొంటూ శ్రావణి దగ్గరకు వచ్చాడు.

"నమస్తే సార్. నా పేరు శ్రావణి. మా అమ్మమ్మతో ఈ పిల్లల పరిస్థితి గురించి కార్తీక్ గారు చెబితే, ఆమె నాకు ఫోన్ చేసి చెప్పింది. మా కాలేజీలో కొందరు అమ్మాయిలు కలసి ఇక్కడికి వారికి కావలసిన వంటసరుకులు తీసుకొని వచ్చాను." అంది.

"అందరినీ పిలిచి 'సరుకులన్నీ గదిలో పెట్టండి" అంటూ శేషాద్రి చెప్పగానే ఆ అబ్బాయి లోపల చదువుకొంటున్న వారినందరినీ పిలుచుకొని వచ్చాడు. లగ్గేజి ఆటోలో వున్నవాటిని దించి లోపల పెట్టసాగారు.

"అమ్మా మీకు కృతజ్ఞతలు ఎలా చెప్పాలో తెలియడం-లేదు. నిలువవున్న వంటసరుకులు ఒక వారం రావచ్చు. నా ఆరోగ్యం దెబ్బతినడంతో దాతల దగ్గరకు వెళ్లలేక లోలోన బాధపడటం తప్ప ఏమీ చేయలేకపోతున్నాను"

"సార్ ఇక్కడ అనాధాశ్రమం బోర్డు కనబడటం లేదే"

"నేనొక రైతును.పిల్లలు లేకపోవడంతో స్నేహితుల సహాయంతో పదిమంది అనాధ పిల్లలను తెచ్చి పెంచసాగాను. గ్రామంలో సహాయం చేస్తున్న వారిని చూస్తుంటే వీరి చదువులు పూర్తి చేయగలమన్న నమ్మకం కలిగింది. కొంతకాలంతరువాత గ్రామంలో పంటలు పండక సహాయం చేసేవారు తగ్గిపోవడంతో ఈ పట్టణానికి వచ్చాను. ఒక దాత ఈ స్థలాన్ని బాడుగలేకుండా ఇచ్చారు. ఈ పదిమంది పిల్లలలో ఆరుమంది తొమ్మిదవతరగతి ,ముగ్గురు ఏడవతరగతి ఒకడు ఆరవ తరగతి చదువుతున్నారు వీళ్ళందరూ నన్ను నాన్నా అంటూ పిలుస్తారు. నేను వీరిని అనాధలుగా భావించలేదు. ప్రస్తుతం నేను మరణానికి దగ్గరలో ఉన్నాను ,నా తరువాత వీరి పరిస్థితి తలచుకొంటే బాధ కలుగుతోంది" చెమ్మగిల్లిన కళ్ళతో అన్నాడు శేషాద్రి

******

"హలో బామ్మగారూ. రెండునెలలక్రితం శేషాద్రి గారు మరణించడానికి ముందు ఆ పిల్లల బాధ్యత నాకు అప్పగించారు. ఇప్పుడు నా జీతం పూర్తిగా ఆ పిల్లలకే ఖర్చు పెడుతున్నా"

"కార్తీక్ జీతం పూర్తిగా ఖర్చవుతుందని భాదపడుతు-న్నావా"

"జీతం గురించి బాధపడటంలేదు. కానీ ముందు ముందు వీళ్ళను ఎలా. ..ఎలా....అన్న ఆలోచనలతో రాత్రిళ్ళు సరిగా నిదురు రావడం లేదు. కాస్సేపు నిదుర పోయినా ఆ పిల్లలగురించే కలలు"

"పీడ కలలు వస్తున్నాయా"

"నా కలలు వింటే మీరే ఆశ్చర్యపోతారు. చందమామ కథలలో లాగా రాజుగారు పల్లకీ పంపి పిల్లలలందరినీ రాజభవనానికి తీసుకెళ్లినట్లు, పిల్లలందరూ సంతోషంతో

వుంటున్నట్లు, స్వర్గంలోనున్న శేషాద్రిగారు చిరునవ్వుతో ఆశీర్వదిస్తున్నట్లు తరచుగా కల వస్తోంది."

"నీ కల నిజం కావచ్చుగా"

"నిదురనుండి లేచి ఆ కల నిజమయితే బాగుంటుందని సంతోషంతో కొన్ని క్షణాలు నేనూ అనుకొంటాను,ఆ తరువాత వీరి ఖర్చులను ఎలా భరించాలన్న ఆలోచనలతో తలపట్టుకొంటాను"

"మీ ఆఫీస్ వారిదగ్గర విరాళాలు అడగవచ్చుగా"

"వారిలో దానగుణం లేదని బాగాతెలుసు. అందుకే వారిని అడగదలచుకోలేదు"

"మీ ఆఫీసులో నీవు తప్ప మిగతా వారందరూ లంచాలు తీసుకొంటున్నట్లు చెప్పావుగా. ఆ పదిమంది పిల్లల కోసం నీవూ లంచం తీసుకో కార్తీక్"

"ఏమిటి బామ్మా లంచం తీసుకొవడమా. అలాంటి పని చేయడం నాకిష్టంలేదు"

"కార్తీక్ నేను ఒక సంఘటన చెబుతాను విను. ఒక సారి కెనడాలో ఒక సినీ తార ముద్దుని ఎయిడ్స్ సంస్థ వారు విరాళంకోసం వేలం వేసిందట. ఒక ప్రముఖ భారతీయ వ్యాపార వేత్త నలభయ్ ఎనిమిది లక్షలు చెల్లించి పదిమంది ముందు ముఖ్యంగా భార్య సమక్షంలో ఆ సినీతారను ముద్దుపెట్టుకొన్నాడట"

"అతని భార్య గొడవ పెట్టలేదా"

"సామాజిక ప్రయోజనం ఉండటంవల్ల ఆమె అంతగా బాధపడలేదట. నేను నీ స్వార్ధంకోసమో ,నీ లాభం కోసమో లంచం తీసుకోమని చెప్పడంలేదు. ఆ పదిమంది పిల్లలకోసం తీసుకోమంటున్నాను"

"నన్నయ్య గారి భారతాన్ని ప్రసన్న కథాకలితార్థయుక్తి అంటూ కొంతమంది మహానుభావులు పొగిడారంటారు. మీరుచెప్పిన కథలో కూడా ప్రసన్న కథా కలితార్థ యుక్తి కనిపిస్తోంది. మీరు చెప్పిన సంఘటన నన్ను ఆలోచింప చేసేలా జేశారు"

******

"హలో కార్తీక్ , నా మనవరాలు చదువుతున్న కాలేజీకి వెళ్ళావా"

"ఆ కాలేజీ ఫంక్షన్ లో మీ మనవరాలు డాన్స్ ప్రోగ్రామ్ ఉందని చెప్పాక వెళ్లకుండా ఎలా వుంటాను, మీ మనవరాలు వేదిక పైకి ఎక్కగానే అమ్మాయిలమధ్య చెప్పట్లు అరుపులు చూడగానే మీ అమ్మాయికి మంచి పేరుందని తెలుసుకున్నాను. భరతనాట్యం బాగానే చేసింది. కానీ అందులో వేగం చూపించి ఉంటే ఇంకా బాగుండేది. కానీ, అందరూ మెచ్చుకొని చాలా గట్టిగా చప్పట్లు కొట్టడం చూస్తుంటే నా ఉద్దేశ్యం పొరపాటనిపించింది. మరోముఖ్యమైన విషయం."

"ఏమిటి కార్తీక్"

"మీ సలహా ప్రకారం నేను లంచం తీసుకొంటున్నాను. పదిమంది పిల్లలకు అన్నం పెట్టగలుగుతున్నాను. పిల్లలకు ఎలాగైనా ఒక దారి చూపించగలనన్న నమ్మకం కలుగుతోంది. వారి భవిష్యత్తు గురించి ఆలోచిస్తుంటే నాకు చాలా దారులు కనబడుతున్నాయి. కొంతమంది అధికారులతో కలసి వారి గురించి మాట్లాడాను"

******

"హలో కార్తీక్, శ్రావణికి మరో మూడు రోజుల్లో వివాహం చెయ్యాలనుకొంటున్నాను"

"అదేమిటి బామ్మా కొన్ని నెలల్లో డిగ్రీ పూర్తవుతుందిగా. .తొందరెందుకూ"

"ఆ రాజనాల గొడవ ఎక్కువయింది. ఈ నెలలోనే పెళ్లి జరిపించమని వారి బంధువులతో కలసి గట్టిగా పట్టుబడుతున్నారు. వాడి బాధ తప్పించుకొనడంకోసం పెళ్లి చెయ్యాలనుకొంటున్నాము. శ్రావణి అక్కడ ప్రేమలో పడిందట. ఆ సంగతి మూడు రోజుల క్రితం చెప్పింది. ఆ అబ్బాయి గురించి విచారించాము చాలా మంచి కుర్రాడని తెలిసింది. వారి తల్లి తండ్రులతోను మాట్లాడాము. వాళ్ళు అంగీకరించారు. రాజనాలకు వేయి కళ్ళు. వాడు పసిగట్టాడంటే ఎంతకైనా తెగిస్తాడు. పెళ్ళికి శ్రావణి ఇంటినుండి ఎవరూ అక్కర్లేదని నిర్ణయించాము. పెళ్లి మాత్రం శ్రావణి స్నేహితురాళ్ళతో, పెళ్ళికొడుకు ముఖ్యమైన బంధువులతో కలిసి గుడిలో జరిపించాలని నిర్ణయించుకొన్నాము."

"బామ్మా, మీరు అనవసరంగా భయపడుతున్నారు. ఇప్పటికైనా పోలీసుల సాయం తీసుకొని మీరనుకొన్న విధంగా పెళ్లి గొప్పగా జరిపించండి"

"రాజనాల గురించి నీకు తెలీదు,అన్నీ ఆలోచించే ఇలా చేయాలనుకొన్నాము. పెళ్లి జరిగిందంటే ఏమీ చేయలేడు"

"మీ ఇష్టం బామ్మా"

"ఈ పెండ్లి జరిగితే నేనొక మొక్కు మొక్కుకొన్నాను"

"గుండుకొట్టుకోవడమే కదా"

"గుండుకొట్టుకోవడంతోపాటు, నీ దగ్గరున్న పది మంది పిల్లల బాధ్యత తీసుకొంటానని మొక్కుకున్నాను నీవుకంటున్న చందమామ కథలాంటి కల నిజం కాబోతున్నది"

"బామ్మా నా...లో.... చాలా.... చాలా టెన్షన్... నా కళ్ళలో నీరు... అవి ఆనంద బాష్పాలు చందమామ కథలలోలా నా కల నిజముగా. .. మీ మనవరాలి పెళ్లి ఏ ఆటంకం కలగుండా నేను చూస్తాను చాలా చాలా సంతోషంగా ఉంది. నేనేమి పని పనిచేయాలో చెప్పండి" సంతోషంతో బిగ్గరగా అన్నాడు.

"నీకు నేనొక అమ్మాయిని చూసాను. అదే ముహూర్తానికి ఆ అమ్మాయికి తాళి కట్టాలి. ఆ అమ్మాయి మనసు బంగారమే కానీ ఒకే ఒక లోపం"

"బామ్మా గారూ, ఆ అమ్మాయి మనసు బంగారం అన్నారు అది చాలు, శారీరక లోపం అన్నారు మీలాగా ఒక కాలు కాదు, రెండు కాళ్ళు లేని... క్షమించండి సంతోషంలో నోరు జారాను. ఏ అమ్మాయయినా మనస్పూర్తిగా తాళి కడతాను. ఎందుకంటె ఆ పదిమంది పిల్లల బాధ్యత మీరు తీసుకొంటున్నప్పుడు నేనేమి చేయడానికైనా సిద్ధమే. దయచేసి ఆ అమ్మాయిలో లోపం ఏమీ చెప్పనక్కరలేదు, ఆమె మనసు బంగారం అన్నారు అది చాలు, కానీ ఒకే ఒక్క కండిషన్ ఏమిటంటే ఆ అమ్మాయి మనస్పూర్తితో నాతో తాళి కట్టించుకోవాలి"

"మీ తల్లి తండ్రులు, ముఖ్యమైన బంధువులతో ఆ గుడి దగ్గరకు వస్తారు. శ్రావణి ప్రేమించింది నిన్నే... నీవు శ్రావణి మేడలో తాళికట్టి ఈ ఊరికి తీసుకునిరా." అంది.

కొంతసేపు ఏమి సమాధానం చెప్పాలో అర్ధంకాక షాక్ తిన్నవాడిలా మూగవాడయ్యాడు.

******

గుడిలో శ్రావణి మేడలో తాళికట్టాడు కార్తీక్. తరువాత అందరూ ఒక వాన్లో బయలుదేరడం వల్ల శ్రావణితో ఏకాంతంగా మాట్లాడలేకపోయాడు.

శ్రావణి ఇంటిలోనికి ప్రవేశించగానే శ్రావణి అమ్మమ్మ ఫొటోకు మాల వేసివుండటం చూసి ఉలిక్కి పడ్డాడు.

"బామ్మ ఎప్పుడు. ..." బొంగురు గొంతుతో అడిగాడు కార్తీక్.

"అదంతా పెద్ద కథ మీకు వివరంగా ఆ తరువాత చెబుతాను. దయచేసి ఇక్కడివారినెవరినీ అడగద్దండి." మెల్లగా అంది శ్రావణి.

మేడమీద శోభనం ఏర్పాటు చేశారు. శ్రావణి రాగానే" బామ్మ ఎప్పుడు మరణించింది. మూడు రోజుల క్రితం మాట్లాడింది" ఆత్రుతగా చెమ్మగిల్లిన కళ్ళతో అడుగుతున్న భర్త వైపు జాలిగా చూసింది శ్రావణి.

"నేను కాలేజీ చదువుతున్నప్పుడు ప్రజలలో సేవాభావం అన్న విషయం మీద ప్రాజెక్ట్ వర్క్ ఇచ్చారు. ఆ ప్రాజెక్ట్ పనికి ఒక ముసలావిడతో మాట్లాడి నిలబడాలని చెప్పాను. అందుకు ఐదువందల రూపాయలు ఇస్తానని చెప్పాను"

"ఆమెను ఆ సమయాన దాటించాను కానీ. ఆమె నీ గురించి అన్ని వివరాలు సరిగ్గా చెప్పిందే. నాతో మాట్లాడిన ఆమె ఎవరు"

"సారీ, నేను ఏర్పాటు చేసిన ఆమె రాక పోవడంతో నేనే బామ్మలాగా వేషం వేసుకొని కాస్తా వణుకుతున్న గొంతుతో మాట్లాడాను. నేను ఇంటర్ చదువుతున్న సమయాన జరిగిన రోడ్డు ప్రమాదంలో నా కాలు ఒకటి కోల్పోయాను. కృత్రిమ కాలు ఏర్పాటు చేసుకొన్నాను. కృత్రిమ కాలు ఏర్పాటు చేసుకొనడానికి ముందు వాడిన చేతి కర్రలను ఆరోజు బామ్మ వేషానికి వాడుకున్నాను. జరిగిందంతా నా స్నేహితురాలు వీడియో తీసింది. మా బామ్మమూడు సంవత్సరాలక్రితమే మరణించింది. బామ్మలాగా వణుకుతూ మాట్లాడినా నేను చెప్పిందంతా నిజం. రాజనాల బావ గొడవ వల్ల పరిస్థితి విషమిస్తోందని తెలుసుకున్నాను. మా నాన్న అనుమతి మీదనే మిమ్మల్ని....." అంటూ తన కృత్రిమ కాలును తీసి మంచం ప్రక్కన పెట్టి సిగ్గుపడుతూ తలవంచుకొంది

"ప్రసన్న కథా కలితార్థ యుక్తి గల చందమామ కథలు ఎన్నో చదివాను, నా జీవితమే అందమైన చందమామ కథలా మారుతుందని ఊహించలేదు" అన్నాడు

"యుక్తిగల చందమామ కథలలోలాగా నాకు మంచి మనసున్న రాజకుమారుడిలాంటి భర్త దొరికాడు" అన్న శ్రావణిని దగ్గరకు తీసుకొన్నాడు కార్తీక్.

అంతవరకు జరుగుతున్నదంతా చూస్తున్న చందమామ సిగ్గుతో మబ్బుల చాటుకు వెళ్ళాడు

మీ స్పందన editor@telugujyothi.com కి పంపగలరు.

# తెలుగు కళా సమితి
# Telugu Fine Arts Society

A 501 (c) Non Profit Org, Tax ID : 22-2534166, www.tfasnj.org

In Association with:

TELANGANA AMERICAN TELUGU ASSOCIATION

SAI DATTA PEETHAM & CULTURAL CENTER SHIRDI IN AMERICA

## CULTURAL PROGRAM

### On Friday, June 9th, 2023



**Smt. Akella Balabhanu** is a first mahila "SATAVADHANINI" Shatavadaana Shyamantakamani, Vanitha Tilaka, Avadaana Saraswati awardee from Amalapuram, (E) Godavari District, She is leading Astavadhani, performed many Sahavadhanams, for the past 13 years, and also involved in spirituality, vaidhika, literature and social actives. This performance has been placed in International Wonder Book of Records.

## శతావధాన శ్యమంతకమణి, అవధాన సరస్వతి
## శ్రీమతి ఆకెళ్ళ బాలభాను గారిచే
# సాహితీ కార్యక్రమం

## అంశం : తెలుగులో చమత్కార సాహిత్యం

On Friday June 9th, 2023

Venue : Sri Shiva Vishnu Temple,

1665-370 Oaktree Road, Edison, NJ 0820

Time : 6:00 pm (followed by Dinner)

TTA : Sudhaker Uppala (732-491-6503) | Madhukar Reddy | Sai Gundur | Narsimha Peruka | Narendar Yarava

SDP : Raghu Sarma Sankaramanchi (516-359-8178) | Murali Medicherla (973-670-0578)

**For additional information:**

Madhu Rachakulla: (201) 312 1305
Srinivas Cheruvu: (732) 447 6686
Jyothi Kamarasu: (609) 578 8606
Bindu Yalamanchili: (908) 240 3167
Venkata Satya Tata: (973) 985 3409
Anil Veerisetty: (571) 218 8562
Ravi Annadanam: (917) 355 5503
Sudha Devulapalli: (732) 331 9313
Naga Mahendar Velishala: (732) 429 6025




Temple NJ
సుస్వాగతం
www.tfas.net

# మట్టి పరిమళం

కొమురవెల్లి అంజయ్య

అన్ని పరిమళాలకు జన్మస్థలి మట్టి
తన పాట తనే పాడుకుంటుంది పచ్చని సుగంధాలతో
ఇవ్వడం తప్ప తీసుకోవడం తెలియని సేద్యకారి
పాఠం నేర్చుకోవాలంటే మట్టిలో పెరిగిన చెట్టు గురువు

అమ్మ, నాన్నల ప్రేమ వాత్సల్యం మట్టి పరిమళాల సేద్యం
పాలు తాగి రొమ్ములు కోస్తానంటే మట్టిలో కలిపేంత ఆగ్రహం

మబ్బులు చిట్టి ముత్యాలై రాలగానే చాలదు కోరిన పంటకు
కూరలో ఉప్పులా చెమట బలం కలిస్తే పసందు
మట్టిలో సేద్యమంటే మట్టి గుణం తెలిసి చేయాలి
అపుడే రైతుకు కడుపారా తృప్తి, కంటినిండా నిద్ర

మట్టిలో పుట్టిన వాటితోనే బతుకుతూ
కాళ్లకు మట్టంటకుండా ఉండాలనుకోవడం
వేర్లను నరికేసి చెట్టు పెరగాలనుకోవడమే
కుమ్మరి మట్టి సారెపై పాత్రలు, చేస్తే జీవనచిత్రాలు
వాములో కాలితే మట్టి పరిమళ జీవన సేద్యం

మట్టి భాష వినడానికి,   కనడానికి, రచించడానికి
మట్టి మనసులను ఆలింగనం చేసుకోవాలి మనసారా
రెండాకుల మొక్కగా మొదలెట్టాలి బతుకు సూర్యనమస్కారంతో
గాలిలోని తేమ కంటే మనిషిలో తేమ కావాలి సంస్కారవంతం
మనిషిగా బతికి మమతలు పంచాలి

పంటకు పట్టిన పురుగులా మట్టిని కలుషితం చేస్తే
జీవుల భవిష్యత్తుపై రెట్ట వేసినట్లే
మట్టి పరిమళ సేద్యం పచ్చగుండాలంటే
మట్టి దేవతను కన్న బిడ్డల్లా కాపాడుకోవాలి
కంటికి రెప్పలా చూసుకోవాలి

---

మీ స్పందన editor@telugujyothi.com కి పంపగలరు.

RAO NETWORK
we thrive with teamwork

Zenith
SERVICES INC.
EMPOWERING TALENT

# ఘనుగు పూలు నవ్వాయి

వంజారి రోహిణి

తండ్రి, కొడుకులు ఇద్దరు రూమ్ లో ఒకరు ఆన్లైన్ క్లాసులో, మరొకరు లాప్టాప్ ముందు ఉన్నారు. టైం తొమ్మిదిన్నర అయింది. ఇంకో అర్ధ గంటలో ఆన్లైన్ క్లాస్ లో కూర్చోవాలి. వంకాయ కూర. పుంటికూర పచ్చడి. మజ్జిగ పులుసు చేయడం అయింది. ఇడ్లీలు స్టాండ్ నుంచి తీసి హాట్ బాక్స్ లో వేసాను. చట్నీ కప్పులోకి తీసి మిక్సీ జార్ సింకులో వేసాను. ఇక బియ్యం కడిగి రైస్ కుక్కర్ లో నీళ్లు పోసి పెట్టేస్తే చాలు. తినే ముందు వండితే చాలు. ఒళ్ళంతా గడ్డ చెమట పట్టేసింది. జుట్టు వెనక్కి దువ్వి చుట్ట చుట్టి నడినెత్తిన క్లిప్ పెట్టుకున్నాను. టవల్ తీసుకుని స్నానానికి వెళుతుండగా కాలింగ్ బెల్ మ్రోగింది. ఈ టైం ల ఎవరై ఉంటారు.

తలుపు తీసి తీయక ముందే" అక్కా.. మీ ఇండ్లల్ల ఏమైన పని ఉంటే చెప్పుండ్రి" గంపెడాశ ముఖంలో పెట్టుకుని ఆతృతగా అడిగింది. ఆమె అక్కా అనటం నాకు కాస్త ఆశ్చర్యం కలిగించింది. కాస్త తేరిపారగా చూసాను. వయసు పాతిక కంటే తక్కువే ఉండచ్చు.

నుదిటిపైనా పావలా కాసంత బొట్టు, మెడలో నల్లపూసల దండ, చేతులకి ఆకుపచ్చని రంగు మట్టి గాజులు, చంద్ర వంకల డిజైన్ తో ముదురు ఎరుపు రంగులో పండిన మైదాకుతో అరచేతులు. కొద్దిగా మాసిన ఎర్ర చీర. ఆమెను చూడగానే ఎందుకో కాస్త జాలిగా అనిపించింది నాకు ఒక్క క్షణమే.

“మాకు పెద్దగా పని లేదు. అవసరం లేదు", అని తలుపు వేయబోయాను. క్లాస్ కి ఆలస్యం అవుతోందని కాస్త చిరాకుగా ఉంది.

తలుపు మూయనీకుండా చేత్తో ఆపి" గట్లనకక్కా!. పిల్లలైనదాన్ని. గిన్నెలు, బాలీసులు మంచిగా తోముత. ఇల్లు ఊడ్చి దినాం మాప్ ఏస్త. వాషింగ్ మిషన్ల బట్టలేసి మంచిగా ఆరేస్తా..చెప్పుకుంటూ పోతోంది" ఆ మాటల్లో ఏదో అయస్కాంతం దాగిఉందనుకుంటా, నన్ను పూర్తిగా ఆకర్షించింది. ఇక తలుపు వేయలేకపోయా. పాపం నిజంగా పని అవసరమేమో ఈ అమ్మాయికి అనిపించింది. తెలిపైన మాటలు, అమాయకమైన చూపులతో ఇక నన్ను మారుమాట్లాడనీకుండా చేసింది.

నా కళ్ళల్లోని అంగీకారం, భరోసా తనలో ఎంత ఉత్సాహం నింపిందో ఏమో, చనువుగా వంటింట్లోకి వెళ్లి సింకులో పడిఉన్న అంట్ల గిన్నెలు చకాచకా తోమడం మొదలుపెట్టింది.

సువర్ణ పనిలో చేరి మూడు నెలలు గడిచిపోయాయి. తను వచ్చాక నా ప్రాణానికి హాయిగా ఉంది. పనిలో చేరిన రోజు నుంచి చూస్తున్నా..! తను మాటల పుట్ట. చేతులు పనిచేస్తున్న నోరు మాత్రం ఊరికే ఉండదు. వాళ్ళ బస్తీలో జరిగిన లొల్లి గురించో, ఇంటి దగ్గర జరిగిన బోనాల పండగ సందడి గురించో, వాళ్ళ అత్త పెట్టే ఆరళ్ళ గురించో ఏదో ఒక ముచ్చట నాకు చెప్పాల్సిందే. గాసిప్స్ వినడం ఇష్టం లేకపోయినా ఎందుకో అమాయకంగా సువర్ణ చెప్పే ముచ్చట్లకు నేను బానిసనైనాను. అలాంటిది ఈ రోజు తను ఒక్క మాట కూడా లేకుండా అంట్లు తోముతోంది.

“ఏంటి సువర్ణ. !ఈ రోజు ఇంటి దగ్గర విశేషాలు ఏం లేవా..? ఏం ముచ్చట చెప్పలేదు నాకు" అన్నాను నవ్వుతూ బ్రెడ్ టోస్టర్ నుంచి తీసి జాం రాస్తూ.

అప్పుడు కళ్ళెత్తి నా వంక చూసింది.అంతే కట్ట తెగిన చెరువు నుంచి పరుగులు తీసే వరద నీటిలా దాని కళ్ళల్లో నుంచి చెంపల మీద కారిపోతున్నాయి కన్నీళ్ళు. ఎప్పటి నుంచి ఏడుస్తోందో కళ్ళు ఉబ్బి ముఖం ఎర్రగా కందిపోయి ఉంది.

సువర్ణని అలా చూడగానే కంగారు వేసింది నాకు." అయ్యో..! ఏమైంది సువర్ణా..? ఇంట్లో అందరు మంచిగా ఉన్నారు కదా. ఎందుకు ఏడుస్తున్నావు. ?" కదిలిస్తే కబుర్ల పెట్టెలా గలగలా నవ్వుతూ మాట్లాడేది కాస్తా ఏడుస్తూ కనపడేసరికి ఒక్కసారిగా విస్మయం చెందాను.

“అందరు మంచిసే ఉన్నరు అక్కా. నాకే ధీమాకు ఖరాబు అయింది. నా మొగుడు యాదగిరి కొట్టిండు" అంది. మళ్ళీ ఆమె కళ్ళు మంజీరా ప్రవాహాలౌతూ ఉన్నాయి.

“అయ్యో.. ! ఎందుకు..ఎందుకు కొట్టాడు నిన్ను" బ్రెడ్ పక్కన పెట్టేసి తను ఏం చెప్తుందా అని ఆత్రుత గా చూసాను

“అక్కా.. వాడు రోజు కైకిలికి పోడు. పోయిన దినం కైకిలి పైసలుతో గుడుంబా తాగి ఇంటికొస్తడు. ఇంట్లో కరుసంతా నాకొచ్చే పైసలుతోని నడుస్తది. తాగచ్చి" లగ్గం అప్పుడు ఇస్తానన్న కట్నం ఇంకా ఈలేదు నీ అయ్య. ముగ్గురు పోరిలను కని నా నెత్తికి చుట్టినవ్" అంటా ఇష్టమొచ్చినట్లు బాదేస్తాడు. నా ఈపు చూడక్కా" అంటూ వీపు చూపించింది

ఆమె వీపు మొత్తం ఎర్రగా కందిపోయినట్లు ఉన్న అరచేతి వేళ్ళ గుర్తులు. జబ్బల మీద కట్టె తో కొట్టినట్లు దెబ్బలు. పాతికేళ్ళు కూడా నిండని సువర్ణ కు ముగ్గురు పిల్లలా..! అదిరిపడ్డాను.

"అయ్యో.. ఇంట్లో ఇంత దారుణాన్ని ఎదుర్కుంటున్నావా నువ్వు?. మరి ముగ్గురు ఆడపిల్లలను కన్నావు కదా, ఇక పిల్లలు కాకుండా ఆపరేషన్ చేయించుకున్నావా లేదా?" సువర్ణ పరిస్థితికి చాల ఆవేదన కలిగింది నాలో.

"అందుకనే అక్కా సచ్చినోడు కొట్టింది. నేను ఆపరేషన్ చేయించుకుంటానన్నాను. పోరడు పుట్టే దాక నువ్వు కనాల్సిందే అని నా మొగుడు, అత్త ఇద్దరు కూడబలుక్కుని నన్ను కుమ్మేసినారు రేతిరి" మళ్ళా బావురుమంది.

లోపల నుంచి మా సంభాషణ అంతా విన్నాడేమో ఎన్నడూ మా మాటల్లో కల్పించుకోని ఆయన బయటకు వచ్చి" సువర్ణా..! నువ్వు భయపడకు. మీ ఆయన దగ్గరకు వచ్చి నేను మాట్లాడతాను. ఆడపిల్లలు తక్కువ కాదు. మగపిల్లవాడు ఎక్కువ కాదు. మంచిగా పెంచి విద్యా బుద్ధులు నేర్పిస్తే ఎవరైనా ఒకటే అని మీ ఆయనకి అర్ధం అయ్యేలా నేను చెప్తాను. నీకు ఆపరేషన్ చేయించేలా మీ అత్తా వాళ్ళని నేను ఒప్పిస్తాను. నువ్వు దిగులు పడకు." నాకు తెలిసిన నిఖిల్ లోని ఈ కొత్త మనిషిని ఇప్పుడే సంబ్రమాశ్చర్యాలతో చూస్తుండిపోయాను.

"గట్లనే సారూ. నిన్నటి సంధి నేను పడుతున్న బాధ మీ మాటల్తో తీరిపోయింది. కానీ నా మొగుడు, అత్తా మంచోళ్ళు కాదు సారు. వాళ్ళకి ఎవరిని మోసం చేద్దామా, పైసలెట్ల గుంజుతామా అని తప్ప ఇంకో పనిలేకుండె. గా మైసమ్మ తల్లి చల్లగా చూడాల మిమ్ములిని" దాని కళ్ళల్లో ఏదో నిశ్చింత. రెండు నెలలు పోటీపడి మరి పరుగు పందెంలో పాల్గొన్నట్లు ముందుకు దూసుకుపోయాయి.

అంట్లు తోముతూ సింకు మీద నుంచి కిందికి వాలిపోయింది సువర్ణ సూరజ్ కి హార్లిక్స్ కలుపుతున్నాను. గబా గబా గ్లాస్ టేబుల్ మీద పెట్టి పోచమ్మని లేపి నెమ్మదిగా నడిపించి సోఫాలో కూర్చోబెట్టాను. ఫ్రిడ్జ్ లో నుంచి గ్లూకోస్ పాకెట్ గ్లూకోస్ వాటర్ కలిపి ఇచ్చాను. నెమ్మదిగా తాగింది. పాపం పని చేసిచేసి ఎంత అలిసిపోయిందో అని జాలి వేసింది తప్ప మరో సందేహం ఏం కలగలేదు నాలో అప్పటికి.

ఐదు నిముషాలు కూడా కాలేదు. నోటికి చేయి అడ్డు పెట్టుకుని సింకు దగ్గరకు పోయి భళ్ళున వాంతి చేసుకుంది. ఈ సారి మాత్రం కాస్త అనుమానంగా చూసాను తనవైపు. నా చూపులకు తప్పు చేసినట్లు తలవంచుకుంది.

అంటే సువర్ణ మొగుడు యాదగిరికి చిలక్కి చెప్పినట్లు నిఖిల్ చెప్పిన మాటలు పెడచెవిన పెట్టారన్నమాట వాళ్ళు. నా సందేహాన్ని తీరుస్తున్నట్లు" వినీతక్కా... ఆపరేషన్ చేసుకొనికి నా అత్త, మొగుడు అసలు ఒప్పుకుంటాలేదు. వంశం నిలబెట్టే పోరడు పుట్టే దాక కనాల్సిందే, లాకుంటే నీ పుట్టింటికి పొమ్మని చెప్పిర్రు" నీరసంగా అంది కింద కూర్చుంటూ.

వంశం సంగతేమో కానీ ఈలోపల నీ వొళ్ళు హూనం అయిపోయేట్లు ఉంది. కాస్త ఆరోగ్యం బాగా చూసుకో. కొన్ని రోజులు విశ్రాంతి అవసరం నీకిప్పుడు. ఎక్కువ పని చేయవద్దు. డాక్టర్ కి చూపించుకో, పండ్లు కొనుక్కుని తిను. ఓ వారం రోజులు పనికి రాకు.నేనెలాగో చేసుకుంటానులే. బాగా విశ్రాంతి తీసుకో" అంటూ వెయ్యి రూపాయలు తన చేతిలో పెట్టాను.

శనివారం వారాంతపు సెలవు రోజు. కాస్త రిలాక్స్ గా టీ తాగుతున్నాం. సూరజ్ ఫ్రెండ్స్ తో క్రికెట్ ఆడుకుంటానని వెళ్ళాడు.

"చూసారా నిఖిల్..! సువర్ణ మళ్ళీ గర్బవతి అయిందట. ఆ రోజు మీరు వెళ్ళి మీరు అంత సేపు చెప్పిన మాటలు బూడిదలో పోసిన పన్నీరు అయినాయి. మీ మాటలు పేద చెవిన పెట్టారు వాళ్ళు. వంశోద్ధారకుడు కావాలి అంటూ మళ్ళీ ఆ అమాయకురాలి ఉసురు పోసుకుంటున్నారు"

"అయ్యో.." అంటూ అభావంగా చూసాడు నా వంక.

"సూరజ్ తర్వాత మనం పాపా కావాలని ఎంత కోరుకున్నా, నా గర్భాశయంలో సిస్టులు పెరుగుతున్నాయి చాల ప్రమాదం అని హిస్టరెక్టమీ ఆపరేషన్ చేసి బిడ్డ సంచి తీసేసారు కదా. నాలో ఇక అమ్మతనాన్ని పొందే అవకాశం లేదని ఎంత కుమిలిపోయానో ఆ రోజు గుర్తుందా నిఖిల్..?" దుఃఖపు జీర నా మాటలకు అడ్డుపడింది.

"నాకు ఇక పిల్లలు పుట్టే అవకాశం లేదని డాక్టర్ దమయంతి చెప్పేసారు కదా. కావాలన్న వాళ్ళకి అవకాశం ఉండదు" సన్నటి నీటి పొర నా కళ్ళను మసకబార్చింది.

"నువ్వు ఎక్కువగా ఆలోచించకు వినీ.. నీ ఆరోగ్యం పాడౌతుంది. మనకు సూరజ్ ఉన్నాడు కదా. వాడితోనే తృప్తి చెందుదాం." మనకు ప్రాప్తం అయిన దానితో తృప్తి పడే మనఃతత్వం నిఖిల్ ది.

కానీ నా తల్లి ఒడి మాత్రం ఓ పాపను లాలించాలని తపన పడుతోంది.

పొద్దున వస్తూనే నన్ను చుట్టేసి బావురుమంది సువర్ణ. ఏం జరిగిందో తెలియని కంగారు నాలో. తనని అలాగే హత్తుకుని అనునయంగా వీపు నిమురుతున్నాను.

"వినీతక్కా..రేపటి నుంచి పనికి రాను" కన్నీళ్ళు దాని బుగ్గలు తడిపేస్తున్నాయి

"అయ్యో. ఏమైంది నీకు.ఆరోగ్యం అంతా మంచిగా ఉంది కదా. ఎందుకు సువర్ణా..!..నీకిప్పుడు ఐదో నెలే కదా"

"అందుకు కాదక్కా..మేము కూలీపనులకోసం ఐద్రాబాద్ వెళ్ళిపోతున్నాం"

"అయ్యో. అదేంటి. నువ్వు ఉత్తమనిషివి కాదు కదా. నువ్వు ఎలా కూలీపనులకు వెళ్తావు"

"నాకిష్టం లేదక్కా. నా అత్తా, మొగుడు ఐద్రాబాద్ లో అపార్ట్మెంట్ల పనుల్లో మంచిగా పైసలు వస్తాయని బలవంతంగా అక్కడికి నన్ను, పోరీలను తోలుకపోతున్నారు.వాళ్లిద్దరూ అనుకుంటే ఇక నా మాట లెక్కజయ్యరు అక్కా" నిన్నటి నుంచి ఎంత దుఃఖభారాన్ని మోస్తోందో గట్టు తెగిన చెరువులాసువర్ణ కళ్ళల్లోనుంచి నీళ్ళు ఆగకుండా.

మూడెన్నెల్ల జీతం అదనంగా ఇచ్చి, నాలుగు కాటన్ చీరలు కవర్ లో పెట్టి తన చేతికి ఇచ్చాను. అంతకంటే ఇంకేం చేయలేకపోయాను అప్పటికి. కృతజ్ఞత నిండిన కళ్ళతో చూస్తూ నా కాళ్ళకి మొక్కాలని వంగబోయిన సువర్ణని పట్టుకుని లేపి గుండెలకు హత్తుకున్నాను. తనని ఎప్పుడూ పనిమనిషిలా చూడలేదు నేను. అమ్మానాన్నలకు ఒక్క కూతురినైన నాకు చెల్లో, తమ్ముడో ఉంటే ఎంత బాగుండేది అనిపించేది. తను అక్కా అన్నపుడల్లా తను నా చెల్లె అనుకున్నా.

"వినీతక్కా..నాకు పోరడు పుట్టాలని దీవించక్కా" అంటున్నప్పుడు దాని కన్నీళ్లు నా భుజాలను తడిపేసాయి. అదే తనని చివరిసారి చూడడం. మళ్ళీ కనిపించలేదు.

సంగారెడ్డిలో అన్న కొడుకు పెళ్ళి చూసుకుని, హైదరాబాద్ వచ్చాము. ఫ్రెండ్ ఒకరు యూ.ఎస్. వెళుతుంటే తనతో రెండురోజులు ఉండాలని తీసుకువచ్చాడు నిఖిల్. కోఠి బజార్, ఉస్మానియా యూనివర్సిటీ వెళ్లి వచ్చాము. రెండో రోజు మధ్యాన్నం తాజ్ బంజారాలో లంచ్. అర్ధరాత్రి శంషాబాద్ ఎయిర్పోర్ట్కి వెళ్ళాం. నాలుగు గంటల ఫ్లైటుకి రంజిత్ కి వీడ్కోలు చెప్పి బాబాయ్ వాళ్ళ ఇంటికి వెళ్ళాం.

ఉదయం చిలుకూరు బయలుదేరాం క్యాబ్లో. భాగ్యనగరపు ట్రాఫిక్ లో ఎదురు కోల అప్పుడు ఆగిఆగి నడిచే కొత్త పెళ్ళికూతురిలా ఆగిఆగి కదులుతోంది క్యాబ్. మెహిదీపట్నం రైతు బజార్ దాటడానికి అర్ధగంట పట్టింది. లంగర్ హౌస్ ఫ్లైఓవర్ దిగాక కాస్త తగ్గింది ట్రాఫిక్. కాస్త ఊపిరి పీల్చుకున్నాం. క్యాబ్ విండో తెరిచాను, కాస్త బయటి గాలి కోసం.

అర్ధ కిలోమీటర్ వెళ్ళాక దారిలో గుంపుగా జనాలు ఉన్నారు. జనాలంతా గోలగోలగా మాట్లాడుతుంటే, ఆ గోలలోనుంచి ఓ పసిబిడ్డ ఏడుపుతో పాటు ఎవరినో బతిమాలుతున్నట్లు దీనమైన ఓ స్వరం. ఎక్కడో విన్నట్లు, సుపరిచితమైన గొంతు అనిపించింది నాకు. ఏదో అనుమానం కూడా ఇంతింతై, వటువింతై అన్నట్లు పెరిగిపోసాగింది నాకు. ఇక ఆగలేక డ్రైవర్ ని కారు ఆపమన్నాము.

ఇద్దరం కారు దిగాం. ఆతృతగా జనాలను తోసుకుని వెళ్ళాను. అదిరిపడ్డాను. అక్కడి దృశ్యాన్ని చూసిన వెంటనే స్పందించిన నిఖిల్ "ఆగండి..! ఎందుకు ఆమెని బలవంతంగా లాకెళ్ళుతున్నారు" పోలీస్ వంక చూస్తూనే సెల్ ఆన్ చేయబోయాడు నిఖిల్.

"ఈమె మీకు తెలుసా? పురిటి బిడ్డని బస్టాండ్లో అమ్మకానికి పెట్టింది. అది చట్ట రీత్యా నేరం. అందుకే స్టేషన్కి తీసుకెళుతున్నాం" కోపం, దర్పం మేళవించిన గొంతుకతో అన్నాడు ఆ పోలీస్ అధికారి. లేడీ కానిస్టేబుల్ సువర్ణ ని లాఠీతో కొడుతూ,లాక్కెళుతోంది.

మమ్మల్ని చూడగానే" వినీతక్కా..అంటూ సంకలో బిడ్డతో సహా నన్ను పట్టుకుని బావురుమంది. అంత దీనమైన పరిస్థితిలో తనని చూస్తాననుకోలేదు. నాకు తెలీకుండానే నా కళ్ళు కూడా నీటి చెలమలైనాయి. పాలుగారే పసిబిడ్డని చేతుల్లోకి తీసుకున్నాను. లోకం పోకడ తెలీని ఆ పసిది నిద్రలోకి జారుకుంది.

"ఆపండి..! ఈమె మాకు బాగా తెలుసు. ఆమె బిడ్డను అమ్మకుండా చూసే పూచి మాది. ఆమెని వదిలి పెట్టండి. లేకుంటే మీ పై అధికారులచేత చెప్పిస్తాను". కాస్త కాఠిన్యం, మరికాస్త మార్దవం కలగలిసిన నిఖిల్ స్వరానికి ఆ పోలీస్ అధికారి కొంచెం దిగివచ్చాడు. మా పూచికత్తు మీద వాళ్ళు సువర్ణ ని విడిచిపెట్టారు.

ఇంటికొచ్చేసాం. హార్లిక్స్ కలిపి సువర్ణకి ఇచ్చాను. ఏ వేళప్పుడు ఏం తిన్నదో ఏమో కానీ హార్లిక్స్ కాస్త వేడిగా ఉన్నా గట గట తాగేసింది. ఎక్కిళ్ళు తగ్గి కాస్త నిమ్మళించి, కొంగు కప్పుకుని బిడ్డకి పాలు పట్టింది.

"ఇప్పుడు చెప్పు సువర్ణా.. బిడ్డను ఎందుకు అమ్మాలనుకున్నావు..?" సూటిగా అడిగిన నా ప్రశ్నకి మళ్ళా "అక్కా" అంటూ బావురుమంది.

"ఈ తడవ కూడా నాకు ఆడపిల్లనే పుట్టే. ఆడపిల్లతోని ఇంటికి వస్తే ఇద్దరిని చంపేసి మళ్ళీ పెళ్లిచేసుకుంటానన్నాడు

నా మొగుడు యాదగిరి.  అత్త వాడికి వంత పాడింది. ఈ బిడ్డతోని ఇంటికి పెళితే వాళ్ళు అన్నంత పని జేస్తరని భయమైంది.  బిడ్డ పుట్టిన మూడో రోజునే దవాఖాన నుంచి బయటకు తోలినరు నన్ను. పుట్టింటికి పోదమంటే నాకు అవ్వ లేదు. పోనీ అయ్య దగ్గరికి పోదామన్న నా దగ్గర పైసలు లేకుండే.  ఏం చేయనికి అర్థం కాక బస్టాండ్ కొచ్చిన.  అక్కడ ఎవలో  పిల్లలవని వాళ్ళు పైసలిచ్చి బిడ్డను తీసుకుంటామన్నరు. అందుకని" అని ఆగింది.

"అందుకని కన్న బిడ్డని పైసలికి అమ్ముకుంటావా..! ప్రాణమెట్ల ఒప్పిందే నీకు" కోపం తో బొంగురు పోయింది నా గొంతు.

"బిడ్డతోని ఇంటికి పొతే చంపేస్తరని అట్లా చేసిన అక్కా..నాకు  బిడ్డనమ్ముకోవడం ఇష్టమైతే లేదు. నేను పెంచలేను. ఎక్కడో ఓ చోట మంచిగా పెరుగుతుందని, ఇంక ఏమి చేయనికి తోచక బిడ్డను అమ్ముదామనుకున్న అక్కా. పైసలు కోసం గాదు"  వెక్కుతూ బిడ్డను గుండెకు అదుముకుంది.

నిఖిల్, నేను ఒకరిముఖం ఒకరు చూసుకున్నాం. ఒకరి భావం ఒకరికి అర్థం అయింది.

"మరి సువర్ణా.. నీ బిడ్డని నాకు దత్తత ఇస్తావా..? మాకు ఆడ పిల్ల కావాలని చాలా ఇష్టం. కానీ ఇక పిల్లలను కనే అదృష్టం నాకు లేదు. నీ బిడ్డని మా  బిడ్డగానే ప్రేమగా చేసుకుంటాము. ఆలోచించి చెప్పు.  నీకు ఇష్టమై, మా మీద నమ్మకం ఉంటేనే ఇవ్వు. నీకు ఇష్టమైనన్ని  రోజులు నువ్వు మాతోనే ఉండు"  ఆశగా  తన చూస్తూ అడిగాను.

వెంటనే ఆ కళ్ళల్లో మెరుపులుమెరిసాయి." అక్కా.. మీరు నా బిడ్డను పెంచుతమంటే, అంతకంటే అదృష్టం ఏముంది నాకు.  బిడ్డను మంచిగ పెంచి, సదివించడం  నాతోని కాదు. నా దగ్గర కన్న మీ దగ్గరే  నా బిడ్డ మంచిగా పెరుగుతుంది. మీ పెద్ద మనసులకి ఎంత మొక్కినా తక్కువే" అంటూ ఆ మూడు రోజుల పసిగుడ్డుని నా ఒడిలో పెట్టింది సువర్ణ.

"అక్కా..ఇంకో మాట" అనింది ఆమె." సందేహంగా చూసాం తను ఏం చెప్తుందా అని

"ఆడ పిల్ల పుడితే ఇక ఇంటికి రావద్దు అని, వొస్తే చంపేస్తామన్నరు కదా  నా మొగుడు, అత్త.   ఆ కసాయి వాళ్ళ ఇంటికి ఇక  పెళ్ళను అక్కా. నా ముగ్గురు ఆడపిల్లలను ఎట్లైనా నేను తెచ్చుకోవాలె.  ఈ బిడ్డకు ఇక మీరే అవ్వ, అయ్యా. నేను ఒక ఆయా లెక్క  మీకు, బిడ్డకు సేవ చేసుకుంటూ మీ పంచలోనే ఉండిపోతాను" సువర్ణ కళ్ళనిండుగా ఆత్మవిశ్వాసం పొంగిపొరలింది ఆ క్షణం.

సువర్ణ కళ్ళల్లోని ఆత్మస్థయిర్యం, నా పట్ల ఉన్న అపారమైన నమ్మకం    చూసి ఇక మేము తన మాటకు తలవొగ్గాము.

రూమ్ లోపల నుంచి వచ్చిన సూరజ్ నా ఒడిలో పాపని చూసి" అబ్బా.. ఈ పాపా చాలా బాగుంది అమ్మ. ఎవరీ పాపా.  ఇలాంటి చెల్లి నాకు ఉంటే ఎంత బాగుంటుందో" అన్నాడు ఆ చిన్నారి  లేత బుగ్గని మెల్లగా  నిమురుతూ.

"ఇలాంటి చెల్లి కాదు సూరజ్. ఈ పాపా నీకు నిజంగా చెల్లె నే" అన్నాను నవ్వుతూ." అవునా" అంటూ

వాడు  సంతోషంగా తలవూపాడు.  ఈ పసిపాప రాకతో మా ఇంట్లో కొత్త సందడి, మా మనస్సులో  కొండంత ఆనందం వెల్లివిరిసాయి.

"నా ఒడిలో పడుకుని నిద్రలో ఉన్న ఆ చిన్నారి ఏ తియ్యటి కల కనిందో ఏమో కానీ, ఆ చిన్ని  పెదవులు విచ్చుకుని, బుగ్గలు సొట్టలు పడేటట్లు నవ్వింది. ఆ నవ్వుని చూసి సువర్ణ నవ్వింది. ఇద్దరిని చూసి మేము నవ్వాము. వాళ్ళిద్దరిని చూస్తుంటే   పేర్చిన బతుకమ్మలో గునుగుపూలు నవ్వినట్లు అనిపించింది నాకు.

మీ స్పందన editor@telugujyothi.com కి పంపగలరు

RK Jewels
Iselin, NJ

MOVERS.Com

# తెలుగు కళా సమితి

## Telugu Fine Arts Society

A 501 (c) Non Profit Org, Tax ID : 22-2534166, www.tfasnj.org

In Association with

## kalavedika

ప్రముఖ రంగస్థల నటులు శ్రీ గుమ్మడి గోపాలకృష్ణ గారి శిక్షణ, దర్శకత్వంలో

తెలుగు కళాసమితి యువతీ యువకులు సమర్పిస్తున్న పౌరాణిక పద్య నాటకం

# శ్రీకృష్ణ రాయబారం

**Co-ordinator :**
**Ravi Kamarasu**

**On16th July, 2023**
**5:00pm EST onwards**



శ్రీ గుమ్మడి గోపాలకృష్ణ

మాజీ ఆంధ్రప్రదేశ్ నాటక అకాడమీ చైర్మన్



**Venue :**
**ANANDA MANDIR**
**269 Cedar Grove Ln,**
**Somerset, NJ 08873.**

**Dinner Served**

ప్రముఖ శాస్త్రీయ సంగీత విద్వాంసురాలు, ఆధ్యాత్మిక గాయని

శ్రీమతి కళ్యాణి ద్విభాష్యం గారితో

# అన్నమయ్య సంకీర్తనలు

DIGITALAYA • +91 9246 578 478

Please register at : https://tinyurl.com/tfassrikrishnarayabaram

**Sponsors**

NEW YORK LIFE

BHOG
Redefined Indian Cuisine

**Free Admission**

KALAVEDIKA: Swathi Atluri, President (732)429-2948, Ujwal Kasthala, Joint Secretary, (551)651-2525


**TFAS Board of Trustees 2022-24**

Madhu Rachakulla: (201) 312 1305
Srinivas Cheruvu: (732) 447 6686
Naga Mahendar Velishala: (732) 429 6025
Bindu Yalamanchili: (908) 240 3167
Sudha Devulapalli: (732) 331 9313
Venkata Satya Tata: (973) 985 3409
Ravi Annadanam: (917) 355 5503
Jyothi Kamarasu: (609) 578 8606
Anil Veerisetty: (571) 218 8562

## ఆత్మీయత సిరులు

కొమురవెల్లి అంజయ్య

వయసును మరిచిపో
పెద్దరికాలు, గొప్పలు వదిలేయి
చిన్నారుల్లో కలిసిపో
ఆటలో ఆటవై
మాటల్లో మాటవై
చిలిపితనంలో చిత్రాంగివికా
కోల్పోయిన నిండైన నవ్వు
చిగురిస్తుంది శరీరమంతా

పల్లె పిల్లల
చిర్రగోనెవో, గోటీలాటవో
సిగరెట్ పత్తాలాటవో, తొక్కుడు బిల్లవో
పుంజీతానివో అయిపో
మట్టి వాసన చర్మంలోకి ఇంకుతుంది
పువ్వు సహజంగా వికసించడం
తెలిసొస్తుంది, తెలివొస్తుంది

ఇంటి ముందర అరుగుమీద
పిచ్చాపాటిలో మాటల తేనె కలుపు
ఊరంతా అక్కడికి దిగొస్తుంది
లోక జ్ఞానం బొట్టు నుదుటికి అంటుకుంటుంది

అనాథాశ్రమం, వృద్ధాశ్రమాలలో
రోజంతా కుదువపెట్టు
మనసుల వాసనలు పీల్చడమే పనిగాపెట్టుకో
జీవితమంటే రూపాయి కాదని

అప్పులు లేని ఆస్తులు
పగిలే మట్టిబొమ్మ లేనని
బుద్ధి వికసిస్తుంది

మట్టి వాసన, వాన
వెలుతురు, గాలి చొరబడని
అద్దాల భవనాల్లో
గోడ కోటలు కట్టుకొని ముడిసిపోతే
యంత్రాల మధ్య యంత్రంగా మారితే
దక్కవు ఆత్మీయతా సిరులు
వెతికి వెతికి వేసారి పోవడమే

కిందకి దిగడం
పైకి ఎగరడం రెండూ తెలియాలి
భూమి పొరల్లోనే బంధాలు, అనుబంధాలు
కలగలిపి ఉంటాయి ఎరువులా
భూమి తల్లిలా మనం మారితేనే
ఆత్మీయత శ్వాస ఆడుతుంది

అసలు, వడ్డీ, చక్రవడ్డీ ఆశించకుండా
ఆత్మీయత అందరికీ పంచుతూపో
జీవితం ఎడారి అనుకున్నప్పుడు
చల్లని నీటి కుండలా ఎదురొస్తుంది
దిక్కుతోచని స్థితిలో ఉన్నప్పుడు
మానవత్వం చెరువులో ఈత కొట్టిస్తుంది

---

## భరత వాక్యం

బి. గౌతమ్ కుమార్

చంద్రుడు నిప్పులు కక్కుకుంటూ నేల రాలాడు
సూర్యుడికి మృత్యువు సోకింది చల్లబడిపోయాడు
కోట్ల సంవత్సరాలు ఉదయించిన భానుడు శాశ్వతంగా అస్తమించాడు
వినీలాకాశం నక్షత్ర మండలం లోకాలన్నీ మటు మాయం
చతుర్థశ భువనాల్లో దొంగను వెతికి పట్టుకోవాలన్న కసితో గ్రహాంతర జీవులు
ఎలియన్స్ హాహాకారాల శబ్దం శూన్యంలో విలీనం
సృష్టికి ప్రతి సృష్టి చేయాలని విర్రవీగిన మానవులు
లాభం స్వార్థం ప్రాంత మతాల కాట్లకు బలి
నిస్సహాయులుగా చూస్తున్న వందల కోట్ల జనం
సృష్టిలోని సమస్త అందాలను వికృతం చేసిన వారు
మానవులా దానవులా చరిత్ర హీనులా
మనిషీ ఆది నువ్వు కాదు అంతం నువ్వే
కనురెప్పలు మూయకముందే సృష్టి కథకి చుక్క
మరో విస్ఫోటనం వుంటుందా జీవి లయిస్తుందా
చర్విత చరణమా సృష్టి అందాలు మరోసారయినా

మీ స్పందన editor@telugujyothi.com కి పంపగలరు.

# కొత్త నడక

డి. నాగజ్యోతి శేఖర్

"చిత్రంగా కళ్ళెగరేసి నన్ను వెక్కిరింపుగా నవ్వింది నా స్నేహితురాలు స్వప్న.చిరుకోపంగా చూస్తున్న నన్ను ఇంకా అలానే ఆట పట్టిస్తూ...

"ఏంటీ!సత్తెకాలపు సుబ్బమ్మా!టెక్నాలజీ దూసుకుపోతున్న ఈ కాలంలో ఉత్తరం రాస్తావా?!అదే కాబోయే భర్త కి. పైగా టెక్కీ గా పనిచేస్తూ. హాయిగా ఏ స్కైప్ లోనో మాట్లాడుకోక! ఇంకా కావాలంటే బయట చక్కగా కలిసి మాట్లాడుకోవాలి.ఇంకా పెన్నూ,కాగితం,రాత-గీతా అంటావేంటే బాబు! నిన్ను చూస్తే నవ్వు రాదా మరి!"అంది ఉడికిస్తూ.అయినా నేనేం చలించలేదు.

"ప్రాణ స్నేహితురాలివని చెప్పా అంతే! నువ్వు నవ్వాల్సిన అంత విషయం ఏముంది ఇందులో.మనం ఎదురుగా ఉన్నా కూడా కొన్ని భావాలు ఎదుటివారికి చెప్పలేము.ఫోన్లో మాట్లాడితే మరు క్షణం మరచి పోతాం. అదే రాత అయితే శాశ్వతంగా ఉంటుంది.ఉన్నది ఉన్నట్టు చెప్పొచ్చు.మరల మరల చదువుకొని ఆనందించవచ్చు.అవి రికార్డెడ్ హిస్టరీ ఒకరకంగా.ఉత్తరాలు చేసిన గొప్ప కార్యాలు చరిత్రలో ఎన్ని ఉన్నాయి. అయినా ఇప్పుడు ఇది నా వ్యక్తిత్వానికి సంబంధించిన సమస్య.అక్షరాలుగా మారితేనే చెరగకుండా ఉంటుంది.నీ నవ్వులాపి దయ చేస్తే నేను ఉత్తరం రాసుకుంటాను".అన్నాను." సరే తల్లి!. ఉత్తరమే రాసుకుంటావో, అత్తారింటికి అత్తరే పూసుకుంటావో నీ ఇష్టం.కానీ అతను బిత్తరబోయి ఉత్తర కుమారుడు అవ్వకుండా చూడు!" అంటూ నా భుజం మీద చరిచి వెళ్ళిపోయింది.చిన్నప్పటి స్నేహం.చదువులై ఉద్యోగాలు చేస్తున్నా చెక్కుచెదరలేదు. నన్ను ఏమైనా అనే చనువు స్వప్నకుంది.తను వెళ్ళాక, నా ఆలోచనలు వారం రోజుల క్రితం కార్తీక్ తో జరిగిన నా పెళ్లిచూపుల ఘట్టంలోనికి మళ్ళాయి!

తనూ నాలానే సాఫ్ట్వేర్ ఇంజనీర్. చూడగానే ఆకట్టుకునే రూపం.నేనూ తనకి నచ్చానని తన చూపుల్ని బట్టి అర్ధమయ్యింది. అయితే ఎక్కడో నాకు సంశయం. నా గూర్చి అమ్మా వాళ్ళు పూర్తిగా చెప్పారో లేదో అని.అయినా చెప్పకుండా ఎలా దాచగలరూ?దాచితే దాగేది కాదు చిన్నప్పటినుండి అడుగు తడబడే నా నడక గూర్చి! చెప్పే ఉంటారు.అయినా అతని నోటి వెంట వినాలి. లేదా నా నోటితోనైనా అతనికి చెప్పాలి.అందుకే అతనితో మాట్లాడాలన్నాను.పెద్దవాళ్ళు అభ్యంతరం చెప్పలేదు.తను కూడా ఉత్సాహంగా

వచ్చాడు నా గదిలోకి. నా వంకే తేరిపారా చూస్తున్న అతని చూపుల్ని మోయలేక నా కనురెప్పలు వాలిపోయాయి.

నీళ్లు నములుతూ.."అదీ...అదీ..మీకు. ..నా గూర్చి." అంటున్న నా మాటల్ని మధ్యలోనే ఆపేసి, "చిన్నప్పటి నుండీ మీకు నడకలో చిన్న తేడా ఉంది అంతే కదా!" చప్పున తలెత్తాను.అతని కళ్ళలో ఎగతాళి లేదు.నిర్మలత్వం ఉంది." అది నాకు ముందే తెలుసు. ఆ అడుగుల వెంటేగా ఇప్పుడు నేను వచ్చింది. కానీ శారీరక దుర్బలత్వాన్ని ఛాలెంజ్ చేస్తూ నువ్వు ఒక్కో మెట్టూ ఎదిగిన విధానంలో కనిపించిన ఆత్మవిశ్వాసం గూర్చి విని,తెలుసుకొని. నీ లాంటి అమ్మాయే కావాలనుకున్నా...!" అంటున్న అతన్ని..." కావాలనుకోవడం వేరు.జీవితాంతం భరించడం వేరు.అందుకే ఈ పెళ్లి చూపులూ అవీ వద్దని ఎంత చెప్పినా అమ్మానాన్న వినడంలేదు.వారిని బాధ పెట్టడం నాకు ఇష్టం ఉండదు.అయినా నా అవకరంతో ఎవర్నీ ఇబ్బంది పెట్టలేను. అమ్మా నాన్నకు ఎలాగూ తప్పదు.ఆ విషయమే మీతో చెబుదామని..." అని చెప్పేసి ఊపిరి పీల్చుకున్నా!.

అతని కళ్ళలో అదే స్థిరత్వం.

"ఇప్పుడు మరింత నచ్చావు. నీ ఆత్మ గౌరవానికి ఏమీ భంగం కలుగదు.కలుగ నివ్వను.నిన్నే పెళ్లి చేసుకుంటా.సరేనా...బాయ్..." అంటూ ఇంకో మాటకి అవకాశం ఇవ్వకుండా బయటకు వెళ్లిపోయిన అతన్ని చూస్తూ ఉద్వేగానికి లోనయ్యా! నాతో పాటు నా లోపాన్ని ఇష్టపడుతున్న అతను నా మదిలో ఒక గౌరవ స్థానం ఏర్పరచుకున్నాడు.ఇన్నాళ్లూ అణచిపెట్టిన కలల లోకానికి అతన్ని అధిపతిని చేశా ఆ క్షణం నుండి!

అనుకున్నవన్నీ జరిగితే అది జీవితం ఎందుకయ్యింది.ఆ రోజు రాత్రి లేట్ గా ఒక ప్రాజెక్ట్ ముగించి అలసటగా అనిపించి లాప్టాప్ మూసి కాస్త గాలి పీల్చికోవాలి అని అమ్మ ఎంతో ప్రేమ గా పెంచిన మా తోటలోకి వెళ్ళాను.మా తోట అంటే నాకెంతో ఇష్టం. నా బాల్య స్నేహితురాలిలా అనిపిస్తుంది.ఎప్పుడో మా తాత గారు నగర చివారులో కొన్న చాలా పెద్ద స్థలంలో విశాలంగా కట్టుకున్న ఇల్లు.ఇప్పుడా స్థలం నగర నడిబొడ్డుకి వచ్చేసింది చుట్టూ ఇల్లు పెరగడంతో. చుట్టూ ఉన్న అపార్టుమెంట్ల మధ్య మా ఇల్లో పురాతన భవంతిలా ఉంటుంది.తాత గారు మంచి ప్రకృతి ప్రేమికుడు, భావకుడు.ఆయన ఎంతో ప్రేమతో అందంగా కట్టుకున్న ఇల్లుని ఆయన ప్రేమ చిహ్నంగా అలానే ఉంచేశారు నాన్న. సాయంత్రాలూ,వెన్నెల రాత్రులూ మేము ముగ్గురం ఆ ఇంటి చుట్టూ ఉన్న పూల తోటలో గడపడం అలవాటుగా మారింది. ఈ రోజు కూడా కాస్త పని నుండి సేద తీరడానికి తోటలోకి వెళుతుండగా చెట్ల వెనుక ఉన్న సిమెంట్ బెంచీ నుండి నాన్న మాటలు వినబడ్డాయి. అమ్మా నాన్న ఇంత రాత్రి అయినా నిద్ర పోలేదా. వాళ్ళ ఏకాంతాన్ని భంగపరచడం ఇష్టం లేక వెనుదిరిగ బోతున్న నాకు నాన్న నోటి నుండి నా పేరు, కార్తిక్ పేరు వినబడడంతో తెలియకుండానే ఆగిపోయా-ను.

"ఎంతైనా మన పూర్వి అదృష్టవంతురాలు లలిత. తన పెళ్లి సమస్య అవుతుంది అనుకున్నాం. కానీ కార్తిక్ లాంటి మంచి అబ్బాయి సంబంధం కుదిరింది" అంటున్న నాన్నను వారిస్తూ.

"ఏం అదృష్టమోనండీ! మన ఇంటిని అతనికి రాసివ్వడం మాత్రం అంత సబబుగా అనిపించడం లేదు. మన పూర్విని సరిగా చూసుకుంటాడా అని ఎక్కడో భయం తొలుస్తుంది అండీ!" అమ్మ నాన్న మాటకి ఎదురు చెప్పడం ఎప్పుడూ వినలేదు. నాన్న అమ్మ వద్దన్నది ఏదీ చేసి ఎరుగడు. కానీ దానికి భిన్నంగా ఈ రోజు...

"భయం దేనికి లలిత! మనకా ఒక్కగాని ఒక్క అమ్మాయి. మన తర్వాత ఎలాగూ ఇదంతా వాళ్లదే కదా. ముందుగా ఇస్తే తప్పేంటి అంట. అయినా నువ్వు ఆ అబ్బాయిని ఎలా ఇలా తప్పుగా అర్థం చేసుకున్నావ్ ..."

నాన్న ఇంకా ఏదో అంటున్నా...వినాలనిపించలేదు. గుండెల్లో బాధ,కోపం సుళ్ళు తిరిగాయి. గబ గబా నడవాలనుకొని అడుగు తడబడి ముందుకు తూలాను. లోపలి నుండి కన్నీరు తన్నుకొచ్చింది. అంటే కార్తీక్... కార్తీక్ తనని ఆస్తి కోసం చేసుకుంటున్నాడా. ఎంత మోసం. పైకి నన్నెంతో అభిమానించానన్న అతను ఇంతటి కుసంస్కారా! అమ్మ వాళ్ళ ప్రేమ సౌధం ఇది. దాన్ని వారికి ఈ పెళ్లి పేరుతో దోచుకోవాలి అనుకున్నాడా! ఒక్కసారిగా అతని మీద ఏర్పరచుకున్న ప్రేమ అంతా ముక్కలయ్యింది. ఆ రాత్రంతా ఏడుస్తూనే ఉన్నా... తెలిసిన కారణానికి, తెలియని దుఃఖాన్ని అక్షరాలుగా మార్చాలనిపించింది ఎప్పటిలానే. తాతగారు ఇలానే ఆనందం వచ్చినా, దుఃఖం వచ్చినా కాగితపై పెట్టేవారు. పక్కనే కూర్చుని" ఎందుకు తాతగారు ఇలా రాస్తూ ఉంటారు అంటే. అక్షరాలు,కాగితాలూ మన బంధువులు అమ్మా. ఈ భావాన్నైనా రాతగా మారిస్తే మనస్సు ఉపశమిస్తుంది." అనేవారు. అదే అలవాటు నాకూ వచ్చింది. తెల్లవారుతుండగా ఆలోచనలు ఓ కొలిక్కి వచ్చి తాతగారి టేబుల్ దగ్గరకు నడిచాను. రాస్తూనే ఉన్నాను. అంతలో స్వప్న వచ్చింది. పొద్దునే మా తోట లో జాగింగ్ చేసి నన్ను పలకరించడం రివాజు తనకి. పొద్దున్నే కాగితాలు ముందేసుకూర్చున్న నన్ను కళ్ళతోనే ప్రశ్నించింది ఏమిటి కథ అన్నట్టు. తనకు జరిగిన విషయం చెప్పాలనిపించలేదు. అవమానంగా అనిపించింది. విషయం దాచి కార్తిక్ కి ఉత్తరం రాయాలి అనుకుంటున్నా అని స్వప్నకు చెప్పిన ఫలితమే ఇందాక జరిగింది. వర్తమానంలోకి వచ్చి ఆగిపోయిన రాతను కొనసాగించా. కార్తిక్ కి గట్టి బుద్ధి చెప్పాలి. అతనితో ఇంక ప్రత్యక్షంగా మాట్లాడదలుచుకోలేదు. అతని గొంతు మరలా వినాలను-కోలేదు. అందుకే నా వ్యక్తిత్వాన్ని ప్రతిబింబించేలా ఉత్తరం రాయాలనుకున్నా!

ఉక్రోషం సిరా గా మార్చి,ఉత్తరం మొదలు పెట్టా! సంబోధన తెలియదు. అయినా రాశా!

"ఓ వరుడా! ఏమన్నావు! వైకల్యం ఉన్నా నా వ్యక్తిత్వం నచ్చి చేసుకుంటున్నా అన్నావు కదూ! కానీ నీ నిజ రూపం ఇప్పుడే బయట పడింది. నా అదృష్టం కొద్దీ పెళ్లికి ముందు-

గానే. నువ్వో డబ్బుకి అమ్ముడుపోయే వ్యక్తివి. అందుకే నా అవయవ లోపానికి అదనపు రుసుముగా మా తాతగారి ప్రేమ నిలయాన్ని దోచుకోవాలను కున్నావ్!

నాతో వేసే తడబాటు సప్త పదుల్ని సంపదగా మార్చుకోవాలనుకున్నావ్. ఔదార్యం పేరుతో అంతస్తు పెంచుకోవాలనుకున్నావ్. కుంచించుకు పోయింది నా కాలు కాదు నీ మనస్సు. నా కన్న వాళ్ళకి నిలువ నీడ లేకుండా చేయాలనుకున్న నీ దోపిడీ గుణంతో నేను సహవాసం చేయలేను. అమ్మకానికి పెట్టిన నీ ఆత్మ తో బంధం పెంచుకోలేను. ఈ పెళ్లి జరగదు. ఇది అహంభావం అని నువ్వనుకున్నా ఇది నా ఆత్మ గౌరవం."

ఎప్పటికీ నీది కాని 'పూర్వి'కళ్ళు మసక బారుతుండగా...మెదడు తేలిక అవుతుండగా మరోసారి చదివి,పొంగిన ఆత్మ విశ్వాసం తో పోస్ట్ చెయ్యడానికి బయలు దేరా!

అక్కడితో అతన్ని నా మనస్సులోంచి తుడి చేసి

నా రొటీన్ లో పడిపోయా!అమ్మా నాన్నలకు మాత్రం విషయం తెలియనీయలేదు.అయితే వారం తర్వాత నాకో ఉత్తరం వచ్చిందని ఆఫీస్ బాయ్ తెచ్చిచ్చాడు. ఆఫీస్ కి ఎవరు రాస్తారు అబ్బా...అదీ ఉత్తరం! అనుకుంటుండగా.. కార్తిక్ కి నేను రాసిన ఉత్తరం జ్ఞాపకం వచ్చింది. ఫ్రొం కార్తిక్. ఒక్కసారిగా కోపం వచ్చి ట్రే లో పడేశా ఉత్తరాన్ని.

ఏం రాసి ఉంటాడు.నాది పొగరు అని తేల్చేసి ఉంటాడు. అంతేనా లేక ఇంకా ఏమైనా బేరాలు ఆడాలనుకుంటు- న్నాడా... అమాయకత్వం నటిస్తూ మరో నాటకం సృష్టించాడా...

సాయంత్రం వరకూ ఇదే ఆలోచనలతో లెటర్ తీసీ, పెడుతున్నా గానీ చదివేందుకు మనస్సు ఒప్పలేదు. ఆఫీస్ అవర్స్ అయిపోయాయి. ఇంటికెళ్లే ముందు అసంకల్పితంగా ఆ ఉత్తరాన్ని హాండ్ బాగ్ లో వేసుకున్నా! బాగ్ చాలా బరువుగా అనిపించింది. నిద్ర పోయే ముందు అకస్మాత్తుగా ఆ ఉత్తరం జ్ఞప్తికి వచ్చి బాగ్ లోంచి తీసి తడబడే చేతుల్తో చించా....

“డియర్ పూర్వి! నన్ను ప్రతిసారీ నీ ఆత్మ విశ్వాసంతో కట్టి పడేస్తున్నావ్! అయితే నీ ఉత్తరం చదివాక నీలో కూడా చిన్న లోపం ఉందని అర్థమయ్యింది. అయితే అది నేను ఖచ్చితంగా సరిదిద్దగలను అనుకో నీకు తోడుగా ఉండి. ఇంతకూ విషయానికి వస్తే ఎంతో తెలివితేటలూ ఉన్న నీకు తొందరపాటు, అపోహ పడడం కూడా ఉన్నాయని ఇప్పుడే తెలిసింది. నువ్వు చాలా పొరబడుతున్నావ్. నేను నిన్ను డబ్బు చూసి చేసుకుంటున్నానా... నీ గుణాల కన్నా ఎక్కువ డబ్బుందా నీ దగ్గర? నీ లోపాన్ని నేను అవకాశం గా కాదు బాధ్యతగా తీసుకున్నా! నీకు తెలుసా నాకో చెల్లి ఉండేది. తనకు చిన్నప్పుడు ఆక్సిడెంట్ వల్ల విరిగిన కాలు సెట్ అవ్వలేదు. గెంతులు వేసే నా చెల్లి చక్రాల కుర్చీకే పరిమితం అయ్యింది. కానీ నీలా నా చెల్లికి ఆత్మస్థైర్యం లేదు. ఆ నైరాశ్యంలోనే తను బలవంతంగా ఈ లోకాన్నీ, మమ్మల్నీ విడిచి వెళ్ళిపోయింది. తన వైకల్యం గూర్చి మేము పడ్డ బాధ, తన నిష్క్రమణ తో మేము అనుభవించిన వ్యధా అంతా ఇంతా కాదు. నీలా ఆత్మవిశ్వాసం తో జీవితంలో ఎదిగి ఉంటే ఎంత బావుండేది.. నా చెల్లిలా ఎందరో శారీరక వైకల్యంతో పాటు మానసిక కుంగుబాటుకి లోనవుతున్న వాళ్ళకి ధైర్యం నింపేందుకు నడుం కట్టుకున్నా! అలాంటి సమయంలో నే నువ్వు తారస- పడ్డావు. నేను పూనుకొన్న కార్యక్రమంలో పాలుపంచు- కొనేనుదుకు నీ లాంటి తోడు కావాలి. అలాంటి వారికి ఆసరా ఇచ్చి వారికి బతుకుపై భరోసా కల్పించాలి. అందుకు నేను ఒక హోమ్ స్టార్ట్ చేసాను. నా సొంత ఖర్చులతో రన్ చేస్తున్నా. దివ్యాంగులను కొందరిని దత్తత తీసుకొని చదువుల్లో ముందుకు వెళ్లేలా చేస్తున్నా. ఇదేదో నా గొప్ప తనం కోసం నీకు చెప్పడం లేదు.నిన్ను కించ పరిచానని అపార్థం చేసుకుంటున్నావని చెబుతున్నాను. నీతో ఈ విషయాలన్నీ పంచుకుందాం అనేంతలో నీ ఉత్తరం వచ్చింది.

ఇంతకీ డబ్బు గూర్చి కదూ నిన్ను కావాలని అనుకుంటున్నానన్నావ్... మీ నాన్నగారు పెళ్లి గ్రాండ్ గా చేసి నాకు బహుమతి గా... అదే కట్నం గా భారీగా ఇస్తానన్నప్పుడు నేను ఆయనతో చెప్పిన మాటలు వింటే నన్ను అర్థం చేసుకుంటావ్ అనుకుంటున్నా. నేను ఎంత వద్దన్నా ఆయన వినకపోవడంతో నా కోరిక చెప్పాను వారికీ

కష్టం కలగ కుండా.  మన పెళ్లి గుడిలో చేసి పెళ్లికయ్యే ఖర్చుని మా దివ్యఅంగ సదన్ కి ఇవ్వమని చెప్పా అంతగా ఇవ్వాలి అనిపిస్తే.చిన్న పసుపు తాడు చాలు పూర్వి నిన్ను నా ఇంటికి తీసుకు పోవడానికి.

నీ ఉత్తరం వచ్చే వరకూ తెలియదు నాకు మీ ఇంటిని నాకివ్వాలనుకుంటున్నారని.అదే విషయం మీ నాన్నగారిని అడిగాను.అప్పుడు వారేం చెప్పారో తెలుసా పూర్వి.

"నా బిడ్డలాంటి ఎందరో బిడ్డల్ని చేరదీయాలను-కుంటున్న నీ గొప్ప ఆశయంలో మాకూ భాగమివ్వు కార్తిక్. ఆ సదన్ ఏదో మా లంకంత ఇంట్లోనే ఉండనివ్వు.  ఇది కోట్లు ఖరీదు చేస్తుందని అందరూ అంటుంటే నేనెప్పుడూ నమ్మలేదు.  దీన్ని అమ్మలేదు.అమ్మలేను.ఇప్పుడు నిజంగా ఒక మంచి ఆశయానికి ఉపయోగపడితే దీని విలువ నిజంగా కోట్ల లో ఉంటుందని నమ్ముతాను.  నా మాట విను కార్తిక్.  పూర్వి, నువ్వూ మా కళ్ళ ముందే ఉండాలన్న చిన్న స్వార్థం కూడా ఉంది ఇందులో" అన్నారు.  అయితే పూర్వి పేరు మీదే ఉంచండి.నాకు, నా ఆశయానికి తను తోడు ఉంటే చాలు అని చెప్పాను.  నిజం పూర్వి.  ఇదే నిజం.  నేను అమ్ముడు పోలేదు పూర్వి! నీ ప్రేమకు మాత్రమే దాసోహమయ్యాను.  నువ్వు నాకు కావాలి పూర్వి.  నువ్వు మాత్రమే కావాలి.ఇంకా నువ్వు అపార్థం లోనే ఉంటే నిన్ను చూసి జాలిపడతాను అంతే! ఉంటాను.

నీ కార్తిక్

ఉత్తరం ముగిసే సమయానికి నా కళ్ళు తెరుచుకుని ఆనంద భాష్పాలు రాల్చాయి.  గుండె నిండుగా ప్రేమ నిండిపోయింది. గబాలున ఫోన్ తీసుకొని కార్తిక్ కి కాల్ చేశా!

"పూర్వీ!" మార్దవంగా పలికిన అతని గొంతు వినగానే" ఎందుకు నాకు వెంటనే చెప్పలేదు?వారం టైం ఎందుకు తీసుకున్నావ్" ఉక్రోషం గా అడిగా. అదే చిరునవ్వుతో చెప్పాడు కార్తిక్.

"నీకు ఉత్తరాలు అంటే ఇష్టం కదా.  చెరగని వ్యక్తిత్వాలు ఎప్పుడూ లేఖా రూపంలోనే ఉండాలని రాశా.  లేఖా రాణికి ఉత్తరం రాయాలంటే ఒక వారమైనా ఆలోచించి అందమైన పదాలు కూర్చొద్దూ...."

ఒక్కసారిగా నా హృదయం సంతోష సాగరమై ఎగసింది. అతని చేయి నన్ను జీవితాంతం తడబడకుండా నడిపిస్తుంది అనే భరోసా కలిగింది.  తృప్తిగా కార్తిక్ రాసిన ఉత్తరాన్ని గుండెలకు హత్తుకున్నా!

ఇక నా" కొత్తనడక" మొదలవబోతుంది.

మీ స్పందన editor@telugujyothi.com కి పంపగలరు.

## తెలుగుతనం

తాతా వేంకట సత్య ప్రభాకర మూర్తి

దిష్టి చుక్క
కాటుక రేఖా
నలుగు రుద్ది ఇక
సాంబ్రాణి పొగ

చదువుల్లో పోటీ
వందకి తక్కువ నాటీ
దేశ విదేశాల్లో
మన వాళ్ళదే ధాటి

బట్టలంటే పిచ్చి
బంగారమంటే ప్రీతి
పండగ పబ్బాలలో మరి
దుకాణాలన్నీ రద్దీ

ఎప్పటికీ ఆగని
నాయికల విలనిజాల
టీవీ సీరియల్స్
ఆడవాళ్ళ మాంచి పల్స్

కష్టమే కందం
ఆటవెలది ఆనందం
ప్రౌఢ ఛందస్సుల మధ్య
వచన కవిత మరీ సుఖం

జడకుచ్చులూ
వడ్డాణాలు
పట్టు పావడాలు
మరి ఆడ పిల్ల కంటే

పునుగులూ
పూత రేకులు
తాపేస్వరం లడ్లు
మడత కాజాలు

గుళ్ళే మూలున్నా,
బాబాలూ, దేవుళ్ళెవరైనా,
బస్సులూ రైల్లళ్ళో
పరిగెట్టే జనం మనం

అవధానాలూ
ప్రవచనాలు
తీరుబడిని
మంచి కాలక్షేపాలు

పెంకితనం
మంకుతనం
మంచి తనం
వెరసి ..

లంగా వోణీలు
పూల జడలు
పల్లెటూళ్ళల్లో,
బాపూ బొమ్మల్లోనే

గుత్తొంకాయలు
గోంగూర పచ్చళ్ళు
ఆవ పట్టిన మావి
అరవై ఊరగాయలు

గోడ చాటున
వీధి ముఖ్యాంశాలు
అమ్మలక్కల నోట
రోజువారీ ప్రసారాలు

సంక్రాంతికి
రంగుల ముగ్గులు
అట్లతద్దికి ఆరట్లు
దసరాకింక మామూలే !

*******

సొంత భాషలో
స్కూళ్ళుండవు
ఊరు భాషల
ఉత్త గొప్పలు

గుమ్మడొడియాలు
పెసరప్పడాలు
నవనాడులూ
కదిలించే నాదస్వరాలు

తిండి కంటే
సినీమాయే ముందు
కొట్లాటలకైనా రెడీ
హీరో ఫానుల పొంగు

ఆంధ్ర నాట్య నట్టువ
కూచిపూడి సత్తువ
అన్నమయ్య పదశోభల
అభినయాన మక్కువ

మీ స్పందన editor@telugujyothi.com కి పంపగలరు.

## ఎల్లలు దాటిన తెలుగుతనం

**బోగా మనోహర్**

తెలుగు వారి గురించి ఏమి చెప్పాలి? ఎంత చెప్పాలి? ఎంత చెప్పిన అదొక తరగని గని కదండీ!! తెలుగుతనం అంటే ఏదో ఒక్క మాటలో చెప్పనలవి కానిదై, అది ఎన్నో అంశాల మిళితం 'కాదు-కాదు', "సమ్మిళితం." అల్లం,జీలకర్ర,పచ్చిమిర్చి,పెసలు కలిస్తే "మంచి పెసరట్టు తయారైనట్లుగా బహు చక్కనైన ఒద్దిక కదటండీనూ"----! ఆగండి, ఆగండి ఇక్కడ నేనొక విషయాన్ని జ్ఞప్తికి చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది. "బొట్టు,బొట్టు చేరి సముద్రమైనట్టు" తెలుగు రెండు రాష్ట్రాలకే పరిమితం కాకుండా "అంతై,ఇంతై వటుడింతైనట్టు జగద్విఖ్యాతి గాంచింది."

వేడి పెసరట్టు, అల్లం చట్నీ కాంబినేషన్లో ఉదయపు ఫలహారం సేవించు వేళ అంతర్జాలంలో Email Notification రాగానే ఆదుర్దాగా ఓపెన్ చేశాను. తెలుగుతనం గురించి మీ మాటల్లో మాకు తెలియ చేయండి అనేది దాని సారాంశం కాగా, అది చూసి సంబరమైంది. ఇక ఆలస్యం దేనికి నా ఆలోచనలన్నీ కార్యరూపం దాల్చి మీ ముందుంచుతున్నాను సుమీ!! ఇవి నేనెక్కడ కాపీ కొట్టలేదండోయి, నా సొంత అభిప్రాయములు మాత్రమే. పాఠకులు ఏకీభవించవచ్చును,పోకవచ్చును. ఇక విషయానికెళితే,

చీర కట్టు,బొట్టు,సంప్రదాయాలు,ఆచారాలు,సాంస్కృతిక కళలు వీటన్నిటితో పాటు తెలుగువాడి ఔన్నత్యము,కీర్తి ఎక్కడైతే ప్రస్తుతించ బడుతుందో అక్కడ తెలుగుతనం వెల్లివిరిసినట్లే. తెలుగు వారి ఆత్మాభిమానం గౌరవించిన ప్రతి చోటా తెలుగుతనం గౌరవించబడినట్లే. "ఏ దేశమేగినా ఎందు కాలిడినా పొగడారా నీ తల్లి భూమి భారతిని నిలపరా నీ జాతి నిండు గౌరవం." తెలుగు విదేశాల్లో కూడా ప్రభుత్వ శాఖల్లో కొలువై ప్రభుత్వ పాలనలో భాగమై "వాషింగ్టన్ హౌజులో, యునైటెడ్ కింగ్డం ప్రెసిడెంట్" హోదాల్లో తమ ప్రతిభా పాటవాలతో అత్యున్నత శిఖరాలు అదిరోహించినప్పుడు "తెలుగుతనం నిండుగా నవ్వుకున్న క్షణం."

ప్రపంచంలో ఏ "మూలకు వెళ్ళినా టార్చిలైటు వేసి వెతకకుండానే" మన తెలుగు వారు కనిపిస్తారు. కానీ ఒకప్పటి పరిస్థితి పూర్తిగా భిన్నం అంటే తెలుగు రాష్ట్రం ఆంధ్రప్రదేశ్ అవతరించక ముందు మన తెలుగువారిని గుర్తించిదెవ్వరు ? తెలుగు భాష ప్రాచీనమైన భాష అయినా తెలుగు వారిని ద్రవిడ తమిళ రాజ్యంలో కలిపి ఏకచ్ఛత్రాధిపత్యంగా ఏలుతున్న రోజులవి. "తెలుగు వారిని మదరాసీలుగానే పిలిచేవారు." అది అవమానకరం. తెలుగువారికి కూడా తగిన గుర్తింపు లేకపోవటంతో "ఆత్మవంచన చేసుకొని ఇక బతకజాలం" అంటూ "తెలుగు వారి ఆత్మగౌరవం కోసం ఎంతోమంది మహానుభావులు నడుం బిగించారు." ఉద్యమాలు సాగించారు. "ప్రముఖంగా పొట్టి శ్రీరాములు గారు ప్రత్యేక రాష్ట్రం ఆంధ్ర ప్రదేశ్ కోసం" బులుసు సాంబమూర్తి గారి ప్రోత్సాహంతో "నిరాహార దీక్ష "చేపట్టకపోతే మనం ఇంకా " ద్రవిడ మదరాసీల ఆధిపత్యంలోనే ఉండేవాళ్లమేమో!!" ఆ "త్యాగశీలి పుణ్యం తెలుగురాష్ట్రం ఆవిర్భవించటం." తెలుగుతనం విశ్వ విఖ్యాతమై పరిఢ విల్లటం!! అలాంటి మహామూర్తికి సినిమా వారి పాటి నివాళులర్పిస్తున్నరా అంటే "ప్రశ్నార్థకమే." అది వేరే విషయం అనుకోండి.

తెలుగు తనం ప్రతి రోజు ప్రతి ఇంటా మన అలవాట్లు, పండుగలు, ఆచార వ్యవహారాలు, సంప్రదాయాలు, పరిసరాలు, పాడిపంటలు, ప్రకృతి, సాంస్కృతిక కార్యక్రమాలు ఇలా ఎన్నో విషయాలతో ముడిపడి ఉంది. మనం జరుపుకునే ప్రతి పండుగలో తెలుగు తనం మరింత ఇనుమడింప బడుతుంది. తెలుగుతనమును ప్రతిబింబించే జడలు,జడలలో పూలు, వయసుకు తగిన పరికిణీ వోణీలు, ముంగిట ముగ్గులు, గొబ్బిమ్మలు "తెలుగు సంస్కృతికి ఇవన్నీ చిహ్నాలే."

తెలుగు భాష అక్షరమాల,వర్ణమాలతో తరియించి అం అఃలు,గుణింతాలు ,వత్తులు,సంధులు, సమాసాలలో చేరి 'మా తెలుగు తల్లికి మల్లెపూదండ', 'చేతి వెన్నముద్ద చెంగల్వ పూదండ' అని ఈనాటి తరం వరకు పాడుకోవటం.

"దేశ భాషలందు తెలుగు లెస్స" అని కితాబిచ్చిన రాయల వారి కొలువులో అష్టదిగ్గజాలు,భువన విజయం,హంపి సోయగం పేరు ప్రస్తావన లేకుండా అజంతా, యెల్లోరా శిల్ప సౌందర్యం గురించి వర్ణించకుండా తెలుగుతనం గురించి మాట్లడగలమా?

"ఆంధ్రప్రదేశ్ అన్నపూర్ణగా విలసిల్ల" సిరులు పండించ ప్రతి రైతు కుటుంబం ఆనంద డోలికలు, "సంక్రాంతి సంబరాలు అంబరాలైతే!" డూడూ బసవన్నలు, హరిదాసులు,ముంగిట ముగ్గులు, గొబ్బిళ్ళు, గుమ్మడి పువ్వులు, పట్టు పావడా ధరియించి గొబ్బి తడుతూ పాటలు పాడుతూ ఆటలు ఆడే పడుచు భామలు, భోగి మంటలు, పాలు గాచి పొంగళ్లు మొదటి రోజు అమ్మవారికి సమర్పించే నైవేద్యం, పెద్దలు-పిన్నలు తలంటు స్నానాలు, భోగి పళ్లు, ముత్తైదువులు దీవెనలు.

రెండో రోజు సంప్రదాయ పిండి వంటలు అరిసెలు, బూరెలు, పాలముంజలు, కజ్జికాయలు, సున్నుండలు, పాయసం, బొబ్బట్లు, జంతికలు, చక్కిలాలు/చక్రాలు, గులాబీ పువ్వులు, తపాల చెక్కలు,పూత రేకులు, రిబ్బన్ పకోడి, ఒక్కొక్క ప్రాంతంలో ఒక్కో పిండివంటలతో "సంక్రాంతి లక్ష్మికి స్వాగతం పలికే."

ఇక మూడో రోజు గారెలు,వడలు,రాగిసంకటి,నాటుకోడి పులుసు మాంసాహారులు అదరహొ అనేలా--! కోడిపందాలు, ఎడ్ల పందాలు, పొట్లగిత్తల మరదల్ని బావలు ముక్కుపిండుతూ ఆట పట్టించటం ఇన్ని విశేషాలున్న “తెలుగు వాళ్ల అతి పెద్ద పండుగ సంక్రాంతి తెలుగు తనానినికి నిలువెత్తు నిదర్శనం కాదా!!”

హరికధలు, బుర్రకధలు, నృత్య ప్రదర్శనలు, పాట కచేరీలు ఇవన్నీ తరతరాలుగా వస్తున్న అచ్చ తెలుగు సంప్రదాయాల్లో భాగం. అలాగే ఉగాది పండుగ తెలుగుతనం ఉట్టిపడే పండుగల్లో ఒకటి. ప్రకృతిలో మమేకమైన పండుగ. సంప్రదాయ చెట్లు వృక్ష సంపదకు నిలువెత్తు సాక్షాలు.వేపచెట్టు ఆయుర్వేద ఔషద గుణాల పుట్ట. వేపపువ్వు, వేప కాయలతో చేసే వేప పచ్చడి ఆరోగ్య శ్రేష్టం, లేలేత మామిడి కాయలతో పచ్చని మామిడి చెట్లు. చిన్ననాటి జ్ఞాపకాలతో చిరిపేటి చెట్టు, చిగుర్లు తొడిగిన జామ చెట్టు, ఏ ఇంటి గృహ ప్రవేశంలో నైన సాక్షాత్కరించే అరటి చెట్టు, కుడుముల తయారీలో వాడే గంగిరేటి ఆకుల గంగిరేటి చెట్టు నేరేడు చెట్టు, బాదం చెట్టు, చింతకాయల చెట్టు, జామ కాయల చెట్టు, రేగి పళ్ళ చెట్టు, కొబ్బరి చెట్లు వృక్ష సంపదను కాపాడుకోవటం కూడా నిలువెత్తు తెలుగుతనమే. ఒక్కొక్క సీజనకి ఒక్కొక్క పండుగ అనుసంధానం చేశారు మన పెద్దవారు. మతాబులు, చిచ్చురు బుడ్లు కళ్లకు మిరుమిట్లు గొలిపే కాంతులలో పిల్లలు కేరింతలు కొడుతుంటే "తెలుగు లోగిళ్ల దీపావళి ఆనంద కేళి."

ఇక శ్రీరామ నవమి నాడు "చలువ పందిరి నీడలో సీతా రాముల వారి పెళ్లి." ఊరు,వాడంతా వడపప్పు పానకంతో తరియించటం “అది కాదా తెలుగుతనం---??”

గుడికి వెళ్లటం, కుంకుమ బొట్టు,నామాలు దిద్దుకోవటం చందనాది తిలకాంక్రుతులు కావటం, సాష్టాంగ నమస్కారాలు ఇవన్నీ మనం ఆచరిస్తున్న ఆచారాలలో భాగమే!!

కార్తీక మాసంలో “దీపజ్యోతులు” గుడి ప్రాంగణంలో ప్రజ్వలించ స్త్రీ మూర్తులు ఒకటిగా చేరి "అరటి దొన్నెల పైన నూనె దీపాలు వదలటం" పరమ శివుణ్ని దర్శించి తరియించ!!

శ్రావణ మాసంలో నోములు, మంగళ గౌరీ పూజలు, వరలక్ష్మి వ్రతాలు ముత్తైదువులకు తాంబులాలు ఇవ్వటం, అమ్మవారి అలంకరణలు ఇవన్ని తెలుగు తనానికి నిలువెత్తు నిదర్శనాలు.

ప్రతి పెళ్లి వేడుక ఒక ఆనంద కోలాహలం. ఆ కోలాహలం తెలుగు తనానికి శోభాయమానం. కొబ్బరాకు పందిర్లు, వడ్డాణం, వంకీలు, బుగ్గన చుక్క, పారాణి ధరియించిన పెండ్లి కూతురు. తలపాగా ధరియించిన పెండ్లి కుమారుడు. జీలకర్ర బెల్లం,వెదురుకోళ్లు,పానుపు వేళ పాడే గమ్మత్తైన పాటలు, కొత్త జంటని గుమ్మంలో నిలిపి అర్ధ మొగుడు ఆడపడుచు నీ మొగుడు పేరేంటమ్మా అంటే సిగ్గుల మొగ్గవుతూ తలదించుకున్న వదినమ్మ, "వరుసైన వారు వసంతం ఆడుకోవటం" (చాల పురాతనమైనది బహుశా గంధర్వుల కాలం నుంచి కొనసాగుతున్న సంప్రదాయం). "పెళ్లి విందు తెలుగు వారికి పసందు." అరటాకు భోజనం అందులో తప్పక వండించే "పప్పు, నెయ్యి, పులిహోర, గోగుర పచ్చడి, గుత్తి వంకాయ కూర లేకుండా తెలుగు వాడి కడుపు నిండుతుందా?"

నిలువెత్తు చీర మడిచి కాళ్లకు అటు,ఇటు చుట్టి నాట్య గత్తె అవతరంచే రంగు రంగుల వస్త్రాలు , ఆభరణాలు ధరించి కాళ్లకు గజ్జె కట్టి ఆడే "నాట్య మయూరి తెలుగు తనానికి చక్కని ప్రతీక."

శిల్పి చెక్కే శిల్ప కళలో తెలుగుతనం ప్రస్ఫుటించే, కుమ్మరి వాడి హస్త కళలో తెలుగుతనం బహు చక్కగా తొంగిచూసే!!

తెలుగు వాడి ఇంట జున్ను, ఉలవ చారు, గడ్డ పెరుగు, మీగడ, వెన్న, గోమాత పూజ, పాడి సంపద తెలుగు తానానికి వన్నె తెచ్చె.

తెలుగు తనం లేనిది ఎక్కడ ప్రతి ఇంటా ప్రతి తెలుగు వారి గండె జప్పుడు. అనునిత్యం ప్రతి అంశంలో తొంగిచూస్తూనే ఉంటుంది. వీటన్నింటి సారాంశం ఒక్కటే తెలుగుతనం అంటే కులం లేదు,మతం లేదు చిన్న,పెద్దా తారతమ్యం లేదు. "అన్ని మరచి అందరూ కలిసి హాయిగా ఆదమరచి చేసుకునే సంబరము." ఆనందాలు పంచిపెట్టే అంగరంగ వైభవం.

------------------సశేషం-------------

మీ స్పందన editor@telugujyothi.com కి పంపగలరు.

# అభయహస్తం

గొర్తి వాణి శ్రీనివాస్

ధనుర్మాసాన్ని పురస్కరించుకుని వీష్ణ్వాలయంలో స్వామివారికి ప్రతి ఏటా భోగం జరుగుతుంటుంది. ఆ సంవత్సరం కూడా గుళ్లో పూజలు అర్చనలు ముమ్మరంగా జరుగుతున్నాయి.

సుదర్శనాచారి గుడి అర్చకుడు.తెల్లవారు జామున లేచి స్నానం చేసి ప్రసాదం చేసేపని మొదలుపెట్టాడు. చలి విపరీతం. చన్నీళ్ళు పోసుకున్నాడేమో వడవడ వణుకుతూ మంత్రాలు చదువుతున్నాడు.

మారెమ్మ వచ్చి గుడి ఆవరణంతా శుభ్రంచేసి ముగ్గులువేసి వెళ్ళింది.

ఆలయ ద్వారాలు తెరిచిన సుదర్శనాచారి అవాక్కయ్యాడు. స్వామివారి అభయ హస్తానికి ఉండాల్సిన వెండి తొడుగుమాయమయింది. పూలలో జారి పడిపోయిం-దేమో అని అంతా వెతికి చూసాడు.ఎక్కడా లేదు కంగారుగా బయటకొచ్చి ఎవరినన్నా పిలుద్దామనుకుంటే ఎవరూ లేరక్కడ.

సుదర్శనాచారికి భయం వేసింది. తను ఏ పాపం ఎరగడు. తనమీద నింద పడుతుందేమో అని విలవిల్లాడాడు.

రాత్రి గుడిలో భక్తుల రద్దీ ఉన్నమాట నిజం. కానీ గుడి తలుపులు మూసేముందు అంతా సజావుగానే ఉన్నట్టు గుర్తు. తెల్లవారేసరికి వెండి తొడుగు మాయం. పోలీసులొస్తే నేరం తనదే అంటారు.

'హయ్యో, పెరుమాళ్ వార్! ఎందుకయ్యా నాకింతటి పరీక్ష పెట్టావు. తెలిసి నేనేతప్పూ చెయ్యలేదుగదయ్యా. నన్ను రక్షించి కర్తవ్యాన్ని బోధించు స్వామీ' అంటూ భారమైన గుండెతో దైవానికి నమస్కరిస్తూ నిలబడ్డాడు.

అప్పుడే ఎండోమెంట్ బోర్డ్ మెంబర్ సూర్యనారాయణ దైవదర్శనానికి వచ్చాడు. ఆవిషయాన్ని ఆయనతో చెప్పాలా వద్దా అని తటపటాయించాడు సుదర్శనాచారి.

ఇప్పుడు కాకపోయినా తర్వాతైనా తెలుస్తుంది. తెలిసీ చెప్పక పోవడం కూడా దోషమే అని గుండె దిటవు చేసుకుని జరిగింది చెప్పాడు.

"అయ్యవారి అభయహస్తం తాలూకు వెండి తొడుగు పోయిందా? జాగ్రత్తగా చూసారా? మీకు తెలీకుండా ఎలా మాయమౌతుంది? అంటే మిమ్మల్ని అనుమానించాలని కాదు. మీరెంత నిజాయితీపరులో నాకు తెలుసు. కానీ ఈ విషయాన్ని పై అధికారులకు వెంటనే తెలియపరుద్దాం. ఇది భక్తుల మనో భావాలతో ముడిపడిన అంశం కాబట్టి ముందుగా పోలీసులకి రిపోర్ట్ చేద్దాం" అన్నాడు.

సుదర్శనాచారి గుడి బాధ్యత ఇంకొకరికి అప్పజెప్పి సూర్యనారాయణతో కలిసి పోలీస్ స్టేషన్ కి బయల్దేరాడు.

పోలీసులు వాళ్ళిచ్చిన కంప్లైంట్ తీసుకుని సుదర్శనాచారిని ఎస్. ఐ గారు వచ్చేదాకా బల్లమీద కూర్చోమన్నారు. సూర్యనారాయణ వెళ్ళిపోయాడు. గంటయ్యింది రెండు గంటలు గడిచినా ఎస్ ఐ రాలేదు.

కాఫీ తెప్పించి ఇచ్చారు. సుదర్శనాచారి వద్దని చెప్పాడు.

స్వామి కైంకర్యం చేసి నివేదన చెయ్యనిదే పచ్చి గంగైనా ముట్టని నాకెందుయ్యా ఇంత పరీక్ష పెట్టావు. తెలియని అపరాధం చేసుంటాను.అందుకే నాకీ శిక్ష వేశావు అనుకుంటూ కళ్ళుమూసుకున్నాడు.

ఫ్లాస్క్ తో కాఫీ పట్టుకొచ్చాడు సుదర్శనా చారి కొడుకు వాసు. "నాన్నా! మిమ్మల్ని ఇక్కడకు తీసుకొచ్చి విచారించడం అన్యాయం. మీరేం తప్పుచేసారని? దేవుడి సామానుపోవడం మీ తప్పెలా అవుతుంది? ఎస్ ఐ గారితో నేను మాట్లాడతాను" అన్నాడు

"నువ్వేం మాట్లాడొద్దు, నేనేతప్పూ చేయలేదని నా అంతరాత్మకి తెలిసి.ఆ దేవుడికి తెలుసు. నిజం ఒక్కటే ఉంటుంది.అది తప్పకుండా బయటపడుతుంది.నువ్వు ఇంటికెళ్లు, అమ్మ కంగారుపడుతుంటుంది. నేను బాగానే ఉన్నానని చెప్పు.ఎస్ ఐ గారితో మాట్లాడి వెంటనే వచ్చేస్తానని చెప్పు. రాముడు మావయ్యకు ఫోన్ చేసి చెప్పు."

"సరే నాన్నా జాగ్రత్త. మనవాళ్ళంతా పోలీస్టేషన్ బయట కూర్చున్నారు. నీకేం కాదు నాన్నా" అన్నాడు.

ఎప్పుడూ దైవ పూజ తప్ప ఏమీ తెలీని అమాయకుడై తండ్రి అలా పోలీస్టేషన్ కి రావడాన్ని జీర్ణించుకోలేకపోయాడు వాసు. మధ్యాహ్నం అయింది.ఎస్ ఐ రాగానే కేస్ వివరాలు చెప్పాడు కానిస్టేబుల్.

గుడికి సంబంధించిన సిసి కెమారా ఫుటేజ్ తెప్పించి చూసారు.

దీపం వెలుగు తప్ప అక్కడ అంతా చీకటిగా ఉంది. అర్ధరాత్రి పన్నెండు గంటలకి ఎవరో తచ్చాడుతున్నట్టు కనిపించింది.ఏదీ స్పష్టంగా లేదు. ఆ కదిలేది మనిషా కాదా కూడా తెలియకుండా అస్పష్టంగా ఉంది. గుడిలోకి ఎవరో చొరబడ్డారని అర్ధమవుతోంది.

కానీ దైవానికి సంబంధించిన ఏ ఒక్క వస్తువునీ ముట్టుకోలేదు. బంగారు గిన్నెలు కూడా పోలేదు. కేవలం ఒక్క అభయ హస్తానికి వుండే వెండి తొడుగు మాత్రమే పోయింది. ఇంత పెద్ద సాహసం చేసింది దీనికోసమేనా? ఇంకేమైనా కారణం ఉందా, వాళ్ళు ఎవరై ఉంటారని విచారణ చెయ్యమని ఆదేశించాడు ఎస్ ఐ. రిపోర్ట్ తయారు చేయించి సుదర్శనచారి చేత సంతకం పెట్టించుకుని పంపించేశారు.

నీరసంగా ఇంటికొచ్చిన భర్తని చూసి బావురుమంది భార్య రుక్మిణి." చీమకైనా అపకారం తలపెట్టని మీకెందుకండీ ఇంత పరీక్ష, ఒక సంతోషాన్ని మీతో పంచుకుందామనుకు-నేంతలో ఇలా జరిగిపోయింది. మనవాడికి క్యాంపస్ సెలక్షన్స్ లోమంచి ఉద్యోగం వచ్చింది. జీతం కూడా ఎక్కువే.ఇక మన కష్టాలన్నీ తొలగిపోయినట్టే.

వాడు మనిద్దర్నీ పువ్వుల్లో పెట్టి చూసుకుంటాడు. మనం పొట్టకట్టుకుని రూపాయి రూపాయి కూడబెట్టి వాడ్ని చదివించింది ఈరోజుకోసమే కదండీ. మనసారా సంతోషించే సమయంలో మీమీద ఈ నింద పడటం బాధగా వుందండీ" రుక్మిణి తన ఆవేదనంతా వెళ్లగక్కుకుంది.

"ఊరుకో రుక్మిణీ కొడుకు వలన ఆనందం, కొడుకు చేత బాధ రెండూ అనుభవించాల్సింది మనమే. ఒక కంట కన్నీరు ఒక కంట పన్నీరు ఏకకాలంలో ఒకేలా భావించి తుడుచుకోవాలి మనం" అన్నాడు

"నాన్నా నన్ను క్షమించండి" అంటూ వాసు తండ్రి కాళ్ళమీద పడ్డాడు.

ఏం అర్ధంకాలేదు రుక్మిణికి. ఏం జరిగింది అంది కంగారుగా.

"అమ్మా నన్ను క్షమించు. నాలో ఎంత టాలెంట్ వున్నా ఒక్క ఉద్యోగంలో కూడా సెలెక్ట్ కాలేదు. ఏమీ చదవని మొద్దులు సెలెక్ట్ అవుతుంటే నా బాధ ఎవరితో చెప్పుకోవాలో అర్థం కాలేదు. కాలేజ్ టి ఎన్ పీ కూడా సరిగా స్పందించ-లేదు. ఉద్యోగం రాక నేను మీకు భారంగా మిగిలిపోతానేమో అని భయం వేసింది నాన్నా అందుకే..."

"అందుకే దొంగతనానికి అర్ధరాత్రి పన్నెండు గంటలకు గర్భాలయంలోకి ప్రవేశించావా?"

"మీకెలా తెలుసు నాన్నా?" ఆశ్చర్యంగా అడిగాడు వాసు.

"అంత చీకట్లో కూడా సిసి కెమారాలో నిన్ను నేను గుర్తుపట్టాను. నీకు ఉద్యోగం రావాలని పెరుమాళ్ కి పూజచేసి రక్షరేకు స్వామివారి అభయ హస్తానికి తగిలించి నీ చేతికి కట్టానుకదా. నీ అహంకారంతో దాన్ని నువ్వు నీ కాలికి కట్టుకున్నావు కదూ, ఒళ్ళంతా ముసుగు కప్పుకున్నా నీకాలికి కట్టుకున్న రక్షరేకు దీపం కాంతిలో మెరుస్తూ కనిపించింది. దాన్ని వాళ్లంతా ఏదో వస్తువు అనుకున్నారు. కానీ నేను గుర్తుపట్టాను. నీ అపచారానికి తగిన ఫలితం ఇప్పుడు అందరం అనుభవిస్తున్నాం చూడు"

"అయ్యో నాన్నా, అహంకారంతో కాదు.తీవ్రమైన అసంతృప్తితో అలా చేసాను.తోటివాళ్ళకి ఉద్యోగం వచ్చి నాకు రాకపోతే ఎంత మానసిక హింసకు గురయ్యానో నాకే తెలుసు. చచ్చిపోదామనిపించింది నాన్నా, రెండుసార్లు ప్రయత్నం చేసి విఫలమయ్యాను. చివరకు నేను కోరుకున్న చావుకూడా నాకు రాదా అని గుండె పగిలేలా ఏడ్చాను. నా ఊహ తెలిసిన దగ్గర్నుంచీ మీరు స్వామి అభయ హస్తాన్ని నమ్ముకోమని చెప్పేవారు. నమ్ముకున్నందుకు నాకేం ఒరిగింది. మీకేం ఒరిగింది. అందుకే...."

"అందుకు దొంగతనం చేసి అమ్ముకున్నావా?నాన్నగారికి కళంకం తెచ్చావా అప్రాచ్యుడా." అంది రుక్మిణి ఆవేశంగా

"అమ్ముకోలేదమ్మా, నా ఆత్మాభిమానానికి అడుగడుగు-నా పరీక్షలు ఎదురైనప్పుడల్లా ఆ అభయహస్తాన్ని ముందు పెట్టుకుని దూషిస్తూ నా మనోవ్యధని చల్లార్చుకుందామని తీసుకొచ్చాను. అంతగానీ ఇలా నాన్నగారిమీదకొస్తుందని ఊహించలేదమ్మా"

"ఛీ ఇలాంటి తండ్రికి నువ్వెలా పుట్టావురా? నీ మొహం నాకు చూపించకు"ఆవేశంతో మాటలంటున్న రుక్మిణిని వారించాడు సుదర్శనాచారి.

"యువతలో తీవ్ర నిరాశ , నిస్పృహలే వాళ్ళలో విపరీత ధోరణులను ప్రేరేపిస్తాయి. కొందరు హంతకులు, తీవ్రవాదులు-

గా ఉన్మాదులుగా మారతారు. లక్ష్యం లేకుండా ప్రవర్తిస్తారు. తల్లి దండ్రులుగా వాళ్ళకి ఊరట కలిగించాల్సిన బాధ్యత మనమీదుంది. వాసూ! గెలుపు వచ్చేదాకా ఎదురుచూసే సహనం లేనప్పుడు ఇలాంటి పరిస్తితుల్నే ఎదుర్కోవాల్సొ-స్తుంది. దుక్కిదున్ని, పంటవేసి, ఫలసాయం వచ్చేదాకా రైతు నిరీక్షించకపోతే ఏమౌతుంది? ఎసెట్లో బియ్యం పోసి ఉడికేదాకా ఆగకపోతే అన్నమెలా పుడుతుంది. కాలం మనకోసం దాచివుంచింది పొందాలంటే సహనంతో వేచిచూడాలి."

తలదించుకున్నాడు వాసు.

"ఆచారిగారూ!ఎస్ ఐ గారు మిమ్మల్ని పోలీస్టేషన్ కి తీసుకురమ్మన్నారు.త్వరగా రండి", చెప్పాడు కానిస్టేబుల్..

లబ్బుమంది రుక్మిణి. ఆయనకేం తెలీదని ఏడుస్తూ చెప్పింది.

"నేనూ వస్తాను పదనాన్నా, జరిగింది చెప్తాను ఆ శిక్షేదో నేనే భరిస్తాను"అన్నాడు వాసు.

పోలీసుస్టేషన్ లో ఎండోమెంట్ బోర్డ్ సభ్యులంతా వున్నారు. “రండి ఆచారిగారూ.మిమ్మల్ని అనవసరంగా ఇబ్బంది పెట్టాం. దొంగ దొరికాడులేండి. మీరు కూడా ఈ కంప్లైట్ కాగితాలమీద సంతకం పెట్టండి. ఇక మీ గుడి పనులు మీరు చేసుకోవచ్చు" అన్నాడు సూర్యనారాయణ.

వాసు, సుదర్శనాచారి మొహమొహాలు చూసుకున్నారు

"దొంగ ఎలా దొరికాడు?" అడిగాడు వాసు.

"వారం క్రితం సీ సీ ఫుటేజ్ చూస్తే పాత నేరస్తుడు సుబ్బడు గుడిలోకి ప్రవేసిస్తూ కనిపించాడు. శటకోపాన్ని కాజేశాడు. గుళ్లలో చిన్న చిన్న దొంగతనాలు చేసి తప్పించుకు తిరుగుతున్నాడు. ఇప్పుడు దొరికాడు. పట్టుకుని నాలుగు తంతే స్వామివారి హారం కాజేద్దామని రెండుసార్లు వచ్చానని, అది సాధ్యంకాక చేతికందిన డబ్బులు మాత్రం పట్టికెళ్లానని దీనిసంగతి నాకేం తెలీదని అంటున్నాడు. వెండి హస్తాన్ని ఎక్కడో అమ్మేసి ఆ డబ్బుల్తో తాగేసుంటాడు. అది వాడి పొట్టలోకి చేరిపోయింది.అందుకే ఊచలు లెక్కపెడుతు-న్నాడు" చెప్పాడు హెడ్ కానిస్టేబుల్.

వాసు ఏదో అనేంతలో," అయ్యా! మా అబ్బాయికి మంచి ఉద్యోగం వచ్చింది. మీ అందరి ఆశీస్సులూ అందించండి. అదే మహాభాగ్యం" అన్నాడు సుదర్శనాచారి.

"అభినందనలు బాబూ, తండ్రికి తగ్గ తనయుడివి. మీనాన్న కష్టపడి చదివించినందుకు ప్రయోజకుడివి అయ్యావు. ఉద్యోగం బాగా చేసుకుని పైకిరా." అని అక్కడున్న వాళ్ళంతా అభినందనలు తెలిపారు.

అందరికీ నమస్కరించి కొడుకు చెయ్యి పట్టుకుని అక్కడ్నించి బయటకొచ్చాడు సుదర్శనాచారి.

"నేను చేసిన తప్పుకు వేరెవరో బలవడం నాకిష్టంలేదు నాన్నా. అసలువిషయం చెప్పేస్తాను." అన్నాడు వాసు.

సరే, నువ్వింటికెళ్లు నేను చెప్తాను అని కొడుకుని పంపించి సూర్యనారాయణను ఒకసారి బయటకు రమ్మని పిలిచాడు.

"ఏం ఆచారి గారూ నాతో ఏదన్నా చెప్పాలా?" అన్నాడు..

"ఏం లేదండీ. తప్పు చెయ్యని అతనెవరో జైలుపాల-య్యాడు. అతనివద్ద పోయిన సొమ్మూ దొరకలేదు. పోలీసు విచారణ కొనసాగించమని చెబితే ఎలావుంటుంది?" అన్నాడు.

"వాడు చెయ్యని నేరం లేదుటండీ, ఈనాటికి పాపంపండి సీ సీ కెమారా పాత ఫుటేజుల్లో దొరికాడు.అప్పుడు చేసిన తప్పులన్నింటికీ ఇప్పుడు శిక్ష అనుభవిస్తాడులెండి. నాతో ఇంకేమన్నా చెప్పాలా"

"అవునండీ, ఇన్నాళ్లూ నిరుద్యోగిగా ఉన్న నాకొడుకు వాసు సమాజం మీద, దైవం మీద పెంచుకున్న ద్వేషం కారణంగా ఈ పొరపాటుకు పాల్పడ్డాడు. ఇప్పుడు చేసిన పనికి తీవ్రంగా పశ్చాత్తాప పడుతున్నాడు. ఆ అభయ-హస్తాన్ని తిరిగి స్వామివారికి అలంకరించేందుకు ఉపాయం చెప్పి పుణ్యం కట్టుకోండి. దీనికి ప్రాయశ్చిత్తంగా మీరేం చెయ్యమంటే అది చేయడానికి సిద్ధంగా వున్నాడు. ఆ పెరుమాళ్ళ సాక్షిగా" అంటూ దణ్ణం పెట్టి నిలబడ్డాడు సుదర్శనాచారి.

సూర్యనారాయణ నడుస్తున్నవాడల్లా ఆగి నిలబడిపో-యాడు. కొద్ది సేపు ఆలోచించి “ఎంతపని చేశాడండీ, చిన్నప్పటినుంచీ వాసు ఎంత బుద్ధిగా వుండేవాడో నాకు తెలుసు. అతను సమ్యమనాన్ని కోల్పోయి చేసిన దుందుడుకు చర్య ఇది. ఒకపని చెయ్యండి వాసు కోరుకున్న ఉద్యోగం అతనికి వచ్చింది కాబట్టి అతని మొదటి జీతంతో స్వామివారికి అభయహస్తం చేయించి ఇమ్మనండి. పశ్చాత్తాపాన్ని మించిన ప్రాయశ్చిత్తం లేనేలేదు" అన్నాడు.

సూర్యనారాయణను పెరుమాళ్లుగా భావించి నమస్కరిం-చాడు సుదర్శనాచారి.

..............సమాప్తం.........

మీ స్పందన editor@telugujyothi.com కి పంపగలరు.

# తెలుగు కళా సమితి

# Telugu Fine Arts Society

A 501 (c) Non Profit Org, Tax ID : 22-2534166, www.tfasnj.org

In Association with

# kalavedika

తెలుగు కళా సమితి మరియు కళావేదిక సంయుక్తంగా సమర్పిస్తున్న

**శ్రీకృష్ణరాయబారం** అనే పద్యనాటకానికి అందరికీ ఆహ్వానం.

అమెరికా లో పుట్టి పెరిగిన విద్యార్థినీ విద్యార్థులు
కళారత్న శ్రీ గుమ్మడి గోపాలకృష్ణ గారి శిక్షణ, దర్శకత్వ
పర్యవేక్షణలో ఈ పద్యనాటకాన్ని సమర్పిస్తున్నారు.
ఈ కార్యక్రమానికి సకుటుంబసమేతంగా విచ్చేసి వారినందరినీ
ఆశీర్వదించవలిసినదిగా కోరుతున్నాము.



శ్రీ గుమ్మడి గోపాలకృష్ణ
మాజీ ఆంధ్రప్రదేశ్ నాటక అకాడమీ చైర్మన్

**On16th July, 2023 • 5:00pm EST onwards**

**Venue : ANANDA MANDIR**
**269 Cedar Grove Ln, Somerset, NJ 08873.**

**Co-ordinator :**
**Ravi Kamarasu**



Ishaan Tangirala
Sri Krishna



Jatin Inti
Duryodhana



Vandita Gabbita
Ashwatthama



Aashrith Adiraju
Vidurudu



Pranathi Miryala
Karna



Siddhartha Tamma
Bheeshma



Lalit Nookella
Dhrutarashtra



Lakshmi Sowmya Renduchintala
Gandhari



Sai Samyuktha Renduchintala
Vikarnudu



Ishaan Sai Grandhi
Saatyaki



Sriyan Desiraju
Kripacharya



Srirama Desiraju
Dronacharya

DIGITALAYA • +91 9246 578 478

**Dinner Served**

**KALAVEDIKA:** Swathi Atluri, President (732)429-2948

**Free Admission**

**TFAS Board of Trustees 2022-24**

Madhu Rachakulla: (201) 312 1305
Srinivas Cheruvu: (732) 447 6686
Naga Mahendar Velishala: (732) 429 6025
Bindu Yalamanchili: (908) 240 3167
Sudha Devulapalli: (732) 331 9313
Venkata Satya Tata: (973) 985 3409
Ravi Annadanam: (917) 355 5503
Jyothi Kamarasu: (609) 578 8606
Anil Veerisetty: (571) 218 8562

# న్యూజెర్సీ తెలుగు కళా సమితి - కళావేదిక ఆధ్వర్యంలో
# శ్రీకృష్ణరాయబారం నాటకం ప్రదర్శన, అన్నమయ్య సంకీర్తనలు

అమెరికాలోని న్యూజెర్సీ రాష్ట్రంలో సోమర్సెట్ నగరం లోని ఆనంద్ మందిరం ఆడిటోరియం లో 2023 జులై 16 వ తేదీన తెలుగు కళా సమితి మరియు కళావేదిక ఆధ్వర్యంలో శ్రీకృష్ణరాయబారం నాటకం ప్రదర్శన, అన్నమయ్య సంకీర్తనలు విజయవంతంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి విచ్చేసిన సుమారు 300కు పైగా అతిధులను కార్యదర్శి శ్రీ రవి కృష్ణ అన్నదానం మరియు ఉపాధ్యక్షురాలు శ్రీమతి బిందు యలమంచిలి సాదరంగా ఆహ్వానించారు.

కళావేదిక అధ్యక్షురాలు శ్రీమతి స్వాతి అట్లూరి గారు మరియు తెలుగు కళా సమితి కార్యవర్గం జ్యోతి ప్రజ్వలన తో కార్యక్రమం శుభారంభం చేశారు. ప్రముఖ శాస్త్రీయ సంగీత అధ్యాపకురాలు శ్రీమతి ఉషా ఆకెళ్ళ గారి స్వర రాగ సుధా కళా అకాడెమీ కు చెందిన విద్యార్థినులు గణేశ ప్రార్థనాగీతం ఆలపించారు.

తరువాత ప్రముఖ శాస్త్రీయ సంగీత విద్వాంసురాలు, ఆధ్యాత్మిక గాయని గురు శ్రీమతి కళ్యాణి ద్విభాష్యం గారితో అన్నమయ్య సంకీర్తనలతో భక్తి సంగీత కార్యక్రమాన్ని మొదలు పెట్టారు. శ్రీమతి కళ్యాణి ద్విభాష్యం గారు, కట్టెదురా వైకుంఠము, చూడరమ్మ సతులారా, వేడంబెవ్వని వెదకెడిని, మేడలెక్కి నిన్ను జూచి, వాడ వాడల వెంట,జగడపు చనువు జాతర, ఫాల నేత్రాల ప్రభల వంటి బహుళ ప్రాచుర్యంలో ఉన్న మధురమైన అన్నమాచార్య కీర్తనలు ఆలపించి శ్రోతలను తన గానామృతంలో ఓలలాడించారు. ప్రతి పాట చివర పాడిన గోవింద నామాలు, అందరిని భక్తి రసంలో ముంచెత్తి, సంగీత కార్యక్రమానికి ఎంతో ప్రత్యేకత సంతరించుకునేలా చేశాయి. తెలుగు కళా సమితి కల్చరల్ కార్యదర్శి శ్రీమతి సుధా దేవులపల్లి గారు ఈ కార్యక్రమానికి వ్యాఖ్యాతగా వ్యవహరించారు. అనంతరం ప్రేక్షకుల కరతాళ ధ్వనుల మధ్య శ్రీమతి కళ్యాణి ద్విభాష్యం గారిని తెలుగు కళా సమితి కార్యవర్గం, కళావేదిక అధ్యక్షురాలు శ్రీమతి స్వాతి అట్లూరి గారు మరియు ఉత్తర అమెరికా తెలుగు సంఘం (నాట్స్) ప్రతినిధులు శ్రీ టి పి శ్రీనివాస్ గారు, చైర్ పర్సన్ శ్రీమతి అరుణా గంటి గారు ఘనంగా సత్కరించారు.




అమెరికాలో పుట్టి పెరిగిన ప్రవాస బాలబాలికలు "శ్రీకృష్ణ రాయబారం" పద్యనాటకాన్ని ప్రముఖ పద్యనాటక కళాకారుడు, మాజీ ఆంధ్ర ప్రదేశ్ నాటక అకాడమీ చైర్మన్, కళారత్న శ్రీ గుమ్మడి గోపాలకృష్ణ శిక్షణా మరియు దర్శకత్వంలో ప్రదర్శించి అతిధులను అబ్బుర పరిచారు. శ్రీకృష్ణుడుగా ఇషాన్ తంగిరాల, సుయోధనుడుగా జతిన్ ఇంటి, రాధేయుడుగా ప్రణతి మిర్యాల, ధృతరాష్ట్రుడుగా లలిత్ నూకెళ్ళ, అశ్వథామగా వందిత గబ్బిట, భీష్ముడుగా సిద్ధార్థ తమ్మా, విదురుడుగా ఆశ్రిత్ ఆదిరాజు, గాంధారిగా లక్ష్మి సౌమ్య రెండుచింతల, వికర్ణుడుగా సాయి సంయుక్త రెండుచింతల,ద్రోణాచార్యుడుగా శ్రీరామ దేశిరాజు, కృపాచార్యుడుగా శ్రేయాన్ దేశిరాజు మరియు సాత్యకి గా ఇషాన్ సాయి గ్రంథి నటించారు. "చెల్లియో చెల్లకో", "అలకను రగ్ని ధర్మరాజు", "జెండాపై కపిరాజు", "అంబికా వంశ శాఖ కి", "కుంతి కొడుకులు తుదకింత" వంటి పద్యాలను అలవోకగా, రాగయుక్తంగా పాడి ప్రవాస చిన్నారులు ఆలపించి అహోమనిపించారు. శ్రీ గుమ్మడి గోపాలకృష్ణ గారే స్వయంగా పాత్రధారులకు హార్మోనియం వాద్య సహకారం అందించటంతో నాటకం మరింత రక్తి కట్టింది.

శ్రీ గుమ్మడి గారి నట శిక్షణలో ఈ విద్యార్థులు ప్రదర్శించిన నాటకం ప్రేక్షకులను ఉర్రూతలూగించగా వారి కరతాళధ్వనులతో ఆడిటోరియం మార్మోగింది. శ్రీ గుమ్మడి గోపాలకృష్ణ గారు మాట్లాడుతూ పౌరాణిక పద్య నాటకం తెలుగు వారి వైభవం. పద్య నాటకాలలో అనేక జీవన విలువలు ఉన్నాయి. ఇక్కడ పుట్టి పెరిగిన పిల్లలతో అమెరికా నలుమూలలా తన దర్శకత్వంలో జరుగుతున్న పద్య నాటకాలతో, రాబోయే తరంలో పద్యనాటకం అమెరికాలోనైనా కొనసాగుతుందన్న నమ్మకం కలుగుతోందని అన్నారు. పద్యనాటకం కేవలం తెలుగు భాషకు మాత్రమే సాధ్యమయిన ప్రక్రియ అని, దానిని మనం పరిరక్షించుకోవాలని, అందుకై అన్ని సంస్థలు ఇటువంటి ప్రదర్శనాలను ప్రోత్సహించాలని విజ్ఞప్తి చేసారు. "శ్రీకృష్ణ రాయబారం" పద్యనాటకంలో పాల్గొన్న బాల బాలికల ప్రతిభా పాటవాలకు ముగ్ధులైన శ్రీమతి సునీతా & శ్రీ రమణ క్రోసూరి దంపతులు పిల్లలకు తమ అభినందనలను, నగదు బహుమతిని, ఆశీర్వచనాలను అందజేశారు.

ఈ సందర్భంగా కళావేదిక అధ్యక్షురాలు శ్రీమతి స్వాతి అట్లూరి గారు మాట్లాడుతూ అమెరికాలోని చిన్నారులకు తెలుగు వారి సాంప్రదాయ కళలను నేర్పించే ఆశయంతో కళావేదిక స్థాపించామని,ఇటువంటి కార్యక్రమ నిర్వహణలో భాగం అయినందుకు సంతోషం వ్యక్తం చేసారు. తెలుగు కళా సమితి అధ్యక్షులు శ్రీ మధు రాచకుళ్ళ కార్యక్రమానికి వచ్చిన వారందరికీ ధన్యవాదములు తెలిపారు. ఈ సందర్భంగా శ్రీ మధు రాచకుళ్ళ మాట్లాడుతూ తెలుగు కళా సమితిలో మొట్ట మొదటి సారిగా పౌరాణిక పద్య నాటకాన్ని ప్రదర్శించామని, ఇటువంటి వైవిధ్య

భలితమైన కార్యక్రమాలను నిర్వహించి తెలుగు కళా సమితిని మరింత దృఢంగా తెలుగు ప్రజలకు దగ్గర చేశామని తెలియ చేసారు. తెలుగు కళా సమితి పూర్వపు అధ్యక్షురాలు శ్రీమతి శ్రీదేవి జాగర్లమూడి గారు మాట్లాడుతూ గతంలో కోవిడ్ కారణంగా తెలుగు కళా సమితి పలు కార్యక్రమాలు నిర్వహించ లేకపోయిందని, ప్రస్తుత కార్యవర్గం చేస్తున్న కార్యక్రమాలు అభినందనీయం, చక్కటి ప్రదర్శన చేసిన బాలబాలికలకు కళాభినందనలు



తెలియచేసారు. అనంతరం శ్రీమతి స్వాతి & శ్రీ అట్లూరి దంపతులు శ్రీ గుమ్మడి గోపాలకృష్ణ గారిని ఘనంగా సత్కరించారు.

"శ్రీకృష్ణ రాయబారం" పద్యనాటకానికి శ్రీ రవి కామరసు సమన్వయకర్తగా వ్యవహరించారు. నాటకాన్ని ప్రదర్శించిన పిల్లలను సమీకరించటం, శ్రీ గుమ్మడి గోపాలకృష్ణ గారితో శిక్షణా కార్యక్రమాలను నిర్వహించటం, కావల్సిన పరికరాలను సమకూర్చి ఈ కార్యక్రమం విజయవంతం కావటానికి కృషి చేసినందుకు శ్రీ గుమ్మడి గోపాలకృష్ణ గారు, శ్రీమతి స్వాతి & శ్రీ అట్లూరి దంపతులు (కళా వేదిక), తెలుగు కళా సమితి కార్యవర్గం శ్రీ రవి కామరసు గారిని ప్రత్యేకంగా అభినందించారు. బాలబాలికలను పాత్రధారులుగా అలంకరించటంలో శ్రీమతి శ్రీవల్లి తాడిగడప, కాంతి దొట్ల, చిత్ర సుంకు సహాయం చేసినందుకు, పాత్రధారులు ధరించిన దుస్తులు, ఆభరణాలు తదితర మేకప్ సామగ్రి మరియు హార్మోనియం బాక్స్ సమకూర్చిన శ్రీ వెంకటరావు మూల్పూరి గారికి తెలుగు కల సమితి కార్యవర్గం కృతజ్ఞతలు తెలియచేసింది.

తెలుగు కళా సమితి ఉపాధ్యక్షురాలు శ్రీమతి బిందు యలమంచిలి గారు వెండర్స్ నిర్వహణ వ్యవహారములను నిర్వహించారు. తెలుగు కళా సమితి కార్యదర్శి శ్రీ రవి కృష్ణ అన్నదానం మొత్తం భోజన ఏర్పాట్లు మరియు కార్యక్రమ నిర్వహణ బాధ్యతలను పర్యవేక్షించారు. కోశాధికారి శ్రీ శ్రీనివాస్ చెరువు గారు ఈ కార్యక్రమం నిర్వహణను సమర్థవంతంగా నిర్వహించారు. సాంస్కృతిక కార్యదర్శి శ్రీమతి సుధా దేవులపల్లి గారు మరియు మెంబర్ షిప్ కార్యదర్శి శ్రీమతి జ్యోతి కామరసు కార్యక్రమాల రూపకల్పన చేసి, సమర్థవంతంగా నిర్వహించారు.



యువజన కార్యదర్శి శ్రీ అనిల్ కుమార్ వీరిశెట్టి గారు వాలంటీర్లు విషయాలను పర్యవేక్షించారు. ఇటి కార్యదర్శి శ్రీ నాగ మహేందర్ వెలిశాల మీడియా,ఇమెయిల్ ప్రచారం మరియు అతిధులందరకు భోజన ఏర్పాట్లు వంటి బాధ్యతలను నిర్వహించారు.

ఈ కార్యక్రమానికి బండారు రాజారావు గారు, రవీంద్ర రెడ్డి నిమ్మా (భోగ్ రెస్టారెంట్ ) గారు, తానా ప్రతినిధులు శ్రీమతి లక్ష్మి దేవినేని గారు, న్యూజెర్సీ తానా రీజనల్ వైస్ ప్రెసిడెంట్ శ్రీ రామకృష్ణ వాసిరెడ్డి గారు,నాట్స్ ప్రతినిధులు శ్రీ శ్రీధర్ అప్పసాని గారు, శ్రీమతి అరుణ గంటి గారు, శ్రీ రాజ్ అల్లాడ గారు, శ్రీ సుబ్బారావు సన్నిధి గారు (వాసవి), శ్రీ ఉపేంద్ర చివుకుల గారు, తెలుగు కళా సమితి పూర్వపు అధ్యక్షురాలు శ్రీమతి శ్రీదేవి జాగర్లమూడి గారు, తెలుగు కళా సమితి పూర్వపు కార్యదర్శి శ్రీమతి ఉమా మాకం & సురేష్ దంపతులు తదితరులు వివిధ తెలుగు సంఘాల ప్రతినిధులు హాజరయ్యారు.




ఈ కార్యక్రమాన్ని నిర్వహించటానికి ఆర్థిక సహాయం చేసిన స్పాన్సర్లు శ్యామ్ మద్దాలి గారికి, న్యూయార్క్ లైఫ్, వివేక్ నందివాడ గారికి, శరత్ వేట గారికి, ASSR రెడ్డి గారికి మరియు భోగ్ రెస్టారెంట్ వారికి, ఈ కార్యక్రమాన్ని చిత్రీకరించిన మీడియా ప్రతినిధులు శ్రీమతి శ్రీ ఆనంద్ గారికి, రిహార్సల్స్ కు సహాయం చేసిన వంశీ కొప్పరావూరి గారికి, రఘు రెండుచింతల గారికి తెలుగు కళా సమితి కార్యవర్గం ప్రత్యేకంగా ధన్యవాదములు తెలియచేశారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు వివిధ విభాగాలలో కష్ట పడిన వాలంటీర్స్ వారందరికీ కార్యదర్శి శ్రీ రవి కృష్ణ అన్నదానం పేరు పేరునా ధన్యవాదాలు చెపుతూ జనగణమన జాతీయ గీతంతో కార్యక్రమాన్ని ముగించారు.

---

## తెలుగుతనమంటే

నామని సుజనాదేవి

తెలుగుతనమంటే. .
అచ్చులలో అమ్మతనపు ఆనవాళ్ళు
హల్లులలో హంపిశిల్పాల హొయలు
అక్షరాలలో అరవిరిసిన సుమాల పరిమళాలు
పదాలలో సుస్వరాల పదనిసలు
పద్యాలలో పరవళ్ళు తొక్కే నుడికారాలు
బాణీలలో బంధించే వశీకరణ బాణాలు
జడత్వాన్ని ఝాడిపించే జావళీలు
చటుక్కున మెరిసే చమత్కారాలు
సరిగమల సరాగాల మైమరిచే కీర్తనలు

కవిత్రయం కళ్ళముందు పరిచిన కావ్యాలు
వ్యాసవాల్మీకులు విరచించిన మహాగ్రంథాలు
నాటి రారాజులు పెంచి పోషించిన కళలు ఖండికలు
నేటి కవి దిగ్గజాల కలం నుండి జాలువారిన జాతిరత్నాలు

విదేశీయులనే మెప్పించి రప్పించిన సంస్కృతీ సంప్రదాయాలు
వినువీధిలో విశ్వకేతనం ఎగురవేసిన క్రీడలు పతకాలు
నోటికి కడు పసందుగా ◌అతిథీ దేవో భవాంటూ◌ వడ్డించే అనురాగాలు
పంట చేల గట్లపై వినిపించే లయబద్ధమైన విన్యాసాలు
బాపూ బొమ్మల ముళ్ళపూడి రచనల కలబోతలు
కనువిందు చేసే అచ్చతెలుగు ఆడపడుచుల వయ్యారాలు
వెరసి. తెలుగుతనమంటే
అవని నుండి ఆకాశం వరకు ఆవరించిఉన్న అమృతత్వం
ఆకలిగొన్నవారికి అన్నం పెట్టె ఆత్మీయతానుబంధం
పండగలా ఉన్నది పంచుకోవడం, బంధాలు పెంచుకోవడం
అనిర్వచనీయమైన అనుభూతి
కల్లలెరుగని కపటమెరుగని బంధాల కలబోతలు
ఎల్లలెరుగని అనురాగాల వెల్లువోతలు !

## ఛీఛీ

దేశరాజు రవి కుమార్

పాలిండ్లేమిటి ఇంత పెద్దగా వున్నాయి?
వేళ్ల వెడల్పు చేసి గట్టిగా పిసికాడు
బుళక్కన నెత్తురొచ్చింది
చీఛీ..
కళ్లేమిటి ఇంత విశాలంగా వున్నాయి?
వేళ్లతో పొడిచి లోనికి తొంగిచూశాడు
బోరువెల్ పడినట్టే ఉబికాయ్
చీఛీ..
నడుమేమిటి నడివీధిలోకి వచ్చింది?
చేయి చాచి ఒక్క నొక్కునొక్కాడు
పంక్చరైన లారీ టైర్ లా..
పుసుక్కున గాలొదిలేసింది
చీఛీ..
ఏమిటో దాచిపెట్టావ్?
బొందు పట్టుకుని బర్రున లాగేసాడు
మటన్ షాపులో తలకిందులుగా వేలాడగట్టిన
మేకలా మే..మే.. అంది

చీఛీ..
పైకొచ్చి చూశాడు,పెదవి మాటునేముందో?
సారముడిగి పెచ్చులు దేలిన పచ్చని భూమిలా
నాలిక గిడసబారిపోయింది
చీఛీ..
పొంగిన చెంపల్లోకి నాసిక పొడుచుకొచ్చిందేమి?
వంటింటి మసాలా వాసనలతో పొగచూరి
జిడ్డోడుతోంది.
చీఛీ..
చివరగా అటూఇటూ చూశాడు,
రెక్కలు విప్పినట్టు ఆ చెవి డొప్పలేమిటో?
తాకీతాకగానే ప్రపంచం చెవులు చిల్లులు పడేలా
ఓ స్వరం విరుచుకుపడింది
'యత్ర నార్యస్తు పూజ్యంతే'.
గుడ్.. వెరీ గుడ్,
ఎవ్రీథింగ్ ఈజ్ ఫైన్.

---

## తస్మాత్ జాగ్రత్త!

నల్లబాటి రాఘవేంద్ర రావ్

ఆడపిండం బరువా.. ఓ బండ మనిషీ..
దాన్ని హత్య చేసే హక్కు.. నీకున్నదా?
చట్టాలనుచుట్టాలుచేసుకొనైతైతక్కలా //ఆడపిండం//

ఇన్నాళ్ల ఆడప్రాణితో..కులుకులు..పలుకులు ములుకులు...గిలకలు...
గొలకలు..రకరకాలు
రాజ్యాలు మారాయి.... రోజులు మారాయి
మగతో సమంగా ఆడవారి చదువు, జీతం
మరి ఆడపిండమిపుడు బరువెట్లా అయ్యిందిరా
అబ్బో...అబ్బో...అబ్బబ్బో...ఓరబ్బో..... // ఆడపిండం//

ఆడవారిలోసైతం... లాయర్ల... పోలీసులు..
ఎవరెస్ట్ అధిరోహణం,స్పేస్ ప్రయాణం...
ఇంజనీర్లు..డాక్టర్లు..ప్రిన్సిపాల్స్..శాస్త్రవేత్తలు కవులు..రచయిత్రులు..
నర్తకి..గేయమణులు
మరి ఆడపిండమిపుడు బరువెట్లా అయ్యిందిరా
అబ్బో...అబ్బో... అబ్బబ్బో...ఓరబ్బో...... // ఆడపిండం//

ఆడపిల్లంటే ఇంట్లో పార్వతి లక్ష్మి సరస్వతి..
ఆడపిల్లంటే ఇంట్లో కళకళ..ఇంట్లో గలగల
'ఆడ' మాతృదేవత పొట్టలో కాకుండా
నువ్వెక్కడ జీవం పోసుకున్నావు అసలు?
మరి ఆడపిండమిపుడు బరువెట్లా అయ్యిందిరా
అబ్బో...అబ్బో... అబ్బబ్బో...ఓరబ్బో....... // ఆడపిండం//

ఆడదంటే అమ్మ అక్క చెల్లి భార్య
నీ వంశం పెంచే...దేవుడిచ్చిన తోడు
ఆ ఆడదాని కడుపున మరో ఆడది
పుడితే... నేరమా... ఘోరమా...!!
పాపమా..నీ బ్రతుకు సర్వనాశనమా!
"ఆడపిండం"..జోలికి వస్తే.. ఇక.. నీ బ్రతుకు మురికికూపమే..నీపరిస్థితి
దుర్గతే..అధోగతే..
తస్మాత్ జాగ్రత్త జాగ్రత్త జాగ్రత్త // ఆడపిండం//

తెలుగు కళా సమితి

# Telugu Fine Arts Society

A 501 (c) Non Profit Org, Tax ID : 22-2534166, www.tfasnj.org

# THANKS FOR YOUR DONATION

2022 జూన్ నుండి 2023 జూన్ వరకు తెలుగు కళా సమితిలో
జరిగిన అన్ని సాంస్కృతిక, సామాజిక కార్యక్రమాలకు ఇతోధికంగా
ఆర్థిక సహాయం చేసి ప్రోత్సహించిన దాతలకు
కృతజ్ఞతాపూర్వక ధన్యవాదములు

Nimma Ravindra Reddy
Srinivas Ganta
Ram Kolluri
New York Life
TP Srinivasa Rao
Hari Eppanapally
Radha Kasinadhuni
Ranjit Chaganti
Uday Bhaskar Ganti
Rajani Konduri
Raghu Sankaramanchi
Lakshmi Rachakulla
Nageswar Cherukupalli
Raja Kasukurthi
Vidya Garapati
Jagadeesh Yalamanchili
Anu Para
Santosh Reddy Somireddy
Kumar Tadepalli
Lakshmi Nandiwada
Sankara Rao Polepalle

Sudha Devulapalli
Srinivas Ganagoni
Kiran Duddagi
Sekhar Vemparala
Satyaveni B Rao
Vamsi Vasireddy
Damu Gedala
Sudhaker Uppala
Chandra Tammineedi
Om Prakash Nakka
Praveen Thadakamalla
Shyam Nalam
Murali Medicherla
Laxmi Devineni
Sridhar Chillara
Sarath Veta
Mohan Patlola
Raghava Reddy Ghosala
Raghu Rami Reddy Etukuri
Aruna Ganti

Ravi Annadanam
Mahendar Musuku
Srinivas Guduru
Praveen Guduru
Rajarao Bandaru
Citiair
Janani Krishna
Vivek Nandiwada
Krishna Rani
Thiru Voona
Kiran Tavva
Suresh Kandala
Ravi Karamsetty
Santosh Reddy Koram
Manju Bhargava
Subba Rao Sannidhi
Giri Sikha
VK Events NJ
RK Jewels
Rainbow Events

• TANA • NATS • TTA • NATA • MATA • ATA • SPBMI • Help Foundation • Telugu People Foundation • Bhog Restaurant • Sai Datta Peetham • Manabadi • TFAS Board of Trustees 2022-24


## TFAS Board of Trustees 2022-24

Madhu Rachakulla: (201) 312 1305
Srinivas Cheruvu: (732) 447 6686
Jyothi Kamarasu: (609) 578 8606
Bindu Yalamanchili: (908) 240 3167
Venkata Satya Tata: (973) 985 3409
Anil Veerisetty: (571) 218 8562
Ravi Annadanam: (917) 355 5503
Sudha Devulapalli: (732) 331 9313
Naga Mahendar Velishala: (732) 429 6025







Contact me about a career that can better your financial future while helping others with theirs.

**Thevan Theivakumar**
**Executive Partner**
CLF®

**Phone:** (732) 744-3763
**Cell:** (732) 319-8758
ntheivakuma@ft.newyorklife.com

**New York Life Insurance Company**
379 Thornall Street
8th Floor
Edison, NJ 08837

DIVERSITY JOURNAL 2016 DIVERSITY LEADER AWARD

BEST PLACES TO WORK 2017 for LGBT Equality 100% CORPORATE EQUALITY INDEX

training TOP 125

To learn more about our awards and recognition visit: www.newyorklife.com

SMRU1694783 (Exp. 9/30/2018) EOE M/F/D/V/SO

Insure. Prepare. Retire.

**Be good at life.**

NEW YORK LIFE